ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-2-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 364 పేజీలు: 8+16 వెల: 6.50


టెక్నాలజీ దిగ్గజం మెటాకు సుప్రీం కోర్టు వార్నింగ్

హెచ్1బి వీసా ప్రక్రియ ఇక మరింత కఠినం 5

# 90% సీట్లు 'చేతి'లోకే!



మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌ను అభినందిస్తున్న మంత్రులు

సీఎం రేవంత్‌కు మంత్రుల అభినందన 2

## మునిసిపోల్స్‌లో కాంగ్రెస్ గెలుపు వ్యూహం

### పిసిసి చీఫ్, మంత్రులతో సిఎం రేవంత్ ప్రత్యేక సమావేశం

### రెబెల్స్ ఉంటే రాజీ చేయాలని సూచన

### నేడు మిర్యాలగూడలో సిఎం ఎన్నికల ప్రచారం ఆరంభం

### 3 కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ ఏకగ్రీవాలకు సుగమం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి3:** జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో 90శాతం స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్రంగా వ్యూహాత్మకంగా వెడుతున్నారు. మంగళవారంతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరపున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. వారంరోజుల పాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది. అందులో భాగంగా పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం జూబ్లిహిల్స్‌లోని క్యాంప్ ఆఫీస్‌వద్ద ప్రత్యేకంగా సమావేశంఅయ్యారు. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీనటరాజన్, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చించారు. ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు సీఎం రేవంత్. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సిఎం సూచించారు. అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు. అదే >>2



కేబినెట్‌కు అనుగుణంగా

# గవర్నర్‌దే నిర్ణయం

### తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీం స్పష్టత

### అజారుద్దీన్, కోదండరామ్ నియామకానికి అడ్డంకి తొలగినట్లే..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. ఈ తీర్పుతో అజారుద్దీన్, కోదండరాం నియామకానికి దాదాపు అడ్డంకి తొలగినట్లే తెలుస్తోంది. 2024 ఆగస్టు 16న కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని నెలల తర్వాత వీరిని పదవుల నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే తెలుస్తోంది. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు. సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇదిఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత >>2

కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై నేడు విచారణ 2



ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల

# క్రమబద్ధీకరణ!

### జీవో 25 ప్రకారం విద్యాశాఖ కసరత్తు

### గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి

### 2025-26 యుడైస్ లెక్కల ప్రకారం టీచర్ల రేషనలైజేషన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 3:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణకు విద్యా శాఖ సిద్ధమవుతోంది. ఎక్కువ మంది విద్యార్థులున్న చోటకి తక్కువ మంది విద్యార్థులుండి.. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న వారిని బదలీ చేయడమే ఈ క్రమబద్ధీకరణ ప్రధాన ఉద్దేశంగా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు క్రమబద్ధీకరణను గతంలో ప్రభుత్వం జారీ చేసి జీవో ఎంఎస్ నంబర్ 25 ఆధారంగా చేపట్టాలని భావిస్తోంది. ఇప్పటికే ఈ ఏడాది ఒకసారి టీచర్ల రేషనలైజేషన్‌ను నిర్వహించిన పాఠశాల విద్య శాఖ.. మరోసారి వచ్చే విద్యా సంవత్సరం 2026-27 ప్రారంభం కంటే ముందే నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించిన >>2

# ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని సన్మానిస్తున్న కేంద్రమంత్రులు, ఎన్డీయే ఎంపీలు

### అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

### విమర్శలు ఎదురైనా, సహనమే గెలిపించింది..

### ఎన్డీయె ఎంపీల సమావేశంలో ప్రధాని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్– అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. ఈ ఒప్పందంతో దేశంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే ఒక పెద్ద నిర్ణయం అన్నారు. తమప్రభుత్వం ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత >>2

లోక్‌సభ నుంచి 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్ 5

# దేశాన్ని అమ్మేశారు..

### ట్రంప్ ఒత్తిడికి మోడీ తలొగ్గారు

### రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు

### డీల్ వివరాలు వెల్లడించాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని ఒత్తిడికి లొంగిపోయారన్ని, ఒత్తిడిలో ఉన్నారని పేర్కొంటూ, ఈ >>2



మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న విపక్షనేత రాహుల్




మంగళవారం బూరుగుపల్లిలో పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న ఆశావహులు

## బిఆర్‌ఎస్ టిక్కెట్ ఇవ్వలేదని ఓ జంట వినూత్న నిరసన

### బూరుగుపల్లిలో ఘటన

**చొప్పదండి, ప్రభాతవార్త:** చొప్పదండి పురపాలక సంఘం ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ నుండి టికెట్ ఇస్తానని తమను ఇంటికి పిలిపించి తీరా సమయానికి టికెట్ ఇవ్వలేదని ఆరోపిస్తూ చొప్పదండిపట్టణానికి చెందిన కల్లేపల్లి మహేష్ దంపతులు ఆందోళన నిర్వహించారు గంగాధరమండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఇంటికి ఆ దంపతులు చేరుకొని పురుగుల మందు డబ్బా పట్టుకొని తమను ఇంటికి పిలిచి టికెట్ ఇస్తానని వేరే వారికి బీఫామ్ ఇవ్వడం దళితులను అవమానపరచడమేనని వారు పేర్కొన్నారు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని నిరసన వ్యక్తం చేశారు తీరా సమయానికి టికెట్ ఇవ్వమంటే కేటీఆర్ నుండి ఫోన్ వచ్చిందని ఒత్తిడి వచ్చిందని వేరే వారికి టికెట్ కేటాయించడం >>2

# రైల్వే హాబ్‌గా హైదరాబాద్



### వికసిత్ భారత్ 2047 దిశగా కేంద్ర బడ్జెట్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. >>2

# రిక్రూట్‌మెంట్ జీరో



### తెలంగాణలో రెండేళ్లయినా అందని 2 లక్షల ఉద్యోగాలు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి3:** రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం భీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో"గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల >>2



నేడు పాలమూరుకు బిజెపి చీఫ్ నితిన్ సిన్హా 3

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు



మణిపూర్ సిఎంగా యమ్నం ఖేమ్‌చంద్ 3

ఢిల్లీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శాసనసభా పక్షం

త్వరలో రాష్ట్రపతి పాలన నుంచి విముక్తి



మొగిలిపేటలో ట్రాక్టర్ బోల్తా 2

నలుగురు రైతు కూలీలు మృతి

పలువురికి గాయాలు



జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో మంగళవారం రహదారులు, వాహనాలపై మంచుదుప్పటి

# కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై నేడు విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 4న (బుధవారం) ఉదయం 11గంటలకు విచారణకు హాజరు కావాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై విజయం సాధించింది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద స్పీకర్ కు ఫిర్యాదు చేసారు. దీంతో, బుధవారం ఉదయం 11 గంట లకు జరగబోయే విచారణకు హాజరు కావాలని వివేకానందకు కూడా స్పీకర్ నోటీసులు జారీ చేశారు. కడియం శ్రీహరి, వివేకానంద వాదనలను స్పీకర్ ప్రసాద్ కుమార్ వివరణ తీసుకునే అవకాశం ఉంది. కాగా.. పార్టీ ఫిరాయింపుల కేసులో భాగంగా.. పది మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు పిటిషన్లు తన ముందుకు రాగా.. ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, కాంగ్రెస్ పార్టీలో చేరలేదని తీర్పు ఇచ్చారు. అయితే, దానం నాగేందర్ పిటిషన్ విచారణ దశలో ఉంది. కాగా, ఇప్పుడు కడియం శ్రీహరి పిటిషన్ ను బుధవారం విచారించను న్నారు. మరో ఎమ్మెల్యే సంజయ్ వ్యవహారంపై స్పీకర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి, రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా గెలిచారు. అయితే కడియం శ్రీహరి కారు గుర్తుపై గెలిచి హస్తం గూటికి చేరడం నిబంధనలకు విరుద్ధమని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన స్పీకర్ కార్యాలయం, సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఇరు పక్షాల వాదనలు వినాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కడియం శ్రీహరితో పాటు, ఫిర్యాదుదారుడైన వివేకానందకు కూడా నోటీసులు అందాయి. రేపటి విచారణలో ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలను వివేకా సమర్పించనున్నారు. దీంతో.. కడియం పైన స్పీకర్ నిర్ణయం ఏంటనేది ఆసక్తి గా మారుతోంది.

# మునిసిపోల్స్‌లో బిజెపికి జనసేన మద్దతు

## ప్రచారం చేసేందుకు పవన్ అంగీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చారు. దీంతో పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన నివాసంలో, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా పలు కీలక అంశాలపై సార్థక చర్చ జరిగినట్లు బిజెపి వర్గాలు పేర్కొన్నాయి.జనసేన పార్టీ తరఫున భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతును పవన్ ప్రకటించారు.

# ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ!

>> సందర్భంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌కు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. టెట్-2026 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన నేపథ్యంలో డిఎస్‌సి నిర్వహణపై మాట్లాడిన సందర్భంలో సీఎం ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా.. ప్రైవేటు స్కూల్స్ లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి .. 15 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టుగా తేలింది. రాష్ట్రంలో 62 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తుండగా.. అందులో ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 16.50 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు 1.08 లక్షల మంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 24,235 సర్కారు బడులుంటే వాటిల్లో 16,57,812 మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 15లోపే ఉంది. అయితే ఆర్‌టిఈ నిబంధనల ప్రకారం 30 మంది విద్యార్థులకొక టీచర్ ఉండాలి. వాస్తవంగా రాష్ట్రంలో మంజూరైన టీచర్ పోస్టులు 1,25,583 ఉండగా ప్రస్తుతం వాటిలో 18వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ గవర్నమెంట్ స్కూల్స్ లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుండటంతోనే ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి పడిపోతోంది. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టనున్న ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియతో 10వేలకు పైగా టీచర్ పోస్టులు గల్లంతయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాదిలో మిగులు టీచర్ల సర్దుబాటును చేపట్టారు కానీ రేషనలైజేషన్ జోలికి వెళ్లలేదు. కానీ ఇప్పుడు రేషనలైజేషన్‌ను చేపట్టాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో చివరగా 2015లో రేషనలైజేషన్‌ను చేపట్టారు. ఇపుడు సుమారు 11 ఏళ్ల తర్వాత రేషనలైజేషన్ చేపట్టేందుకు సర్కారు అనుమతినిచ్చింది.

# రైల్వే హబ్‌గా హైదరాబాద్

>> సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణకు బడ్జెట్‌లో కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఎన్నికల బడ్జెట్ కాదు.. వికసిత్ భారత్ లక్ష్యంగా పెట్టిన బడ్జెట్ అని.. తెలంగాణ ఒక హబ్ గా తయారవుతుందని, ఫార్మా, ఐటీ, హెల్త్ ఇలా హబ్ లకు హైదరాబాద్ కేంద్రం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా కాకుండా దేశ అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్‌గా చూడాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు కేటాయించారని, రహదారుల నిర్మాణంలో తెలంగాణకు పెద్దపీట వేశారని ప్రశంసించారు.సింగరేణి విషయంలో కాంగ్రెస్ కూడా కెసిఆర్ బాటలోనే వెళ్తోందని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

# మొగిలిపేటలో ట్రాక్టర్ బోల్తా

## నలుగురు రైతు కూలీలు మృతి

## పలువురికి గాయాలు

**మల్లాపూర్,ప్రభాతవార్త:** మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన నలుగురు పసుపు రైతు కూలీలు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు మొగిలిపేట గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి గంగాధర్ మంగళవారం తన తోటలో పసుపును తవ్వి తీసేందుకు తన ట్రాక్టర్ పై 16 మంది కూలీలను తీసుకొని వెళ్ళాడు పని ముగించుకుని వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడటంతో నలుగురు పసుపు రైతు కూలీలు సంపంగి సాయమ్మ 35, మంగళారపు లలిత 42, రోడ్డ వైష్ణవి 13, పెద్దిరెడ్డి గంగు 45 లు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలోని క్షతగాత్రులను మెట్పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

# కేబినెట్‌కు అనుగుణంగా గవర్నర్‌దే నిర్ణయం

>> మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది. సుప్రీంకోర్టు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. రాజ్యాంగ పరమైన అధికారాల వినియోగంలో అనవసరమైన సందేహాలకు చోటు లేదని, ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకునే ఉద్దేశం తమకు లేదని, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేందుకు మాత్రమే న్యాయవ్యవస్థ జోక్యం ఉంటుందని ధర్మాసనం చెప్పకనే చెప్పిందని చెప్పవచ్చు. మొత్తానికి, తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై నెలకొన్న అనిశ్చితికి సుప్రీంకోర్టు తీర్పు కొంతవరకు తెరదించింది. కేబినెట్ సిఫారసులే కీలకమన్న స్పష్టతతో, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ ఇక ముందుకు సాగనుంది. మార్చి 19న జరిగే తదుపరి విచారణ ఈ అంశానికి పూర్తి పరిష్కారం చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## వారం - వర్జ్యం

04-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
తదియ రా.12.14
పూర్వఫల్గుణి రా.10.17
వర్జ్యం : తె.5.42-7.21
దు.ఉ.11.59-మ.12.45
శుభసమయం : ఉ.6.30-7.15,సా.6.30-7.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** నిజమైన శ్రేయస్సును మీకు చేకూర్చగలిగితే ఎవరన్నది తెలుసుకోగలుగుతారు.పోటీ పరీక్షల్లో విజయం.

**వృషభం:** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన మార్పు లేదే చోటు చేసుకోవు.ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**మిథునం:**పెరుగుతున్న ధర వరలు ఆదాయ, వ్యయాలు మిమ్మల్ని ఆలోచింప చేస్తాయి. వత్తిడి అధికం.

**కర్కాటకం:**బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వహిస్తారు. వాటి తాలూకా ప్రతి ఫలాలను ఎంతమాత్రమూ ఆశించరు.

**సింహం:** మీ పరోక్షంలో జరుగుతున్న విషయాలను కూడా నిశితంగా వ్యవహరిస్తారు.పోటీ పరీక్షలలో విజయం.

**కన్య:**పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. వాహన సౌఖ్యం.

**తుల:**శత్రువులు బలహీన పడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి.నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో చికాకులు తొలుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడుతారు. వస్త్రలాభం.

**ధనుస్సు:** రహస్య సమాచారం వెలుగు చూస్తుంది. పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**మకరం:** ఆర్థిక లావాదేవీల్లో ఒడిదుడుకులను ఎదుర్కొనవలసి వస్తుంది. చెల్లింపులకు వత్తిడి పెరుగుతుంది.

**కుంభం:** వ్యవహారాలు సానుకూల పడతాయి. ఆస్తి వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. వాహనాల కొనుగోలు.

**మీనం :**సోదరుల నుండి ఆశించిన విధంగా సహాయసహకారాలు అందు కుంటారు. గృహయోగం.విలువైన ఆభరణాలు కొనుగోలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 90% సీట్లు 'చేతి'లోకే!

>> విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు స్వయంగా సన్నద్ధమయ్యారు. ఈ మేరకు నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజక వర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన చేయనున్నారు.రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిసాస్తారు. కాగా. రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోని ఏకైక కార్పొరేషన్ మహబూబ్‌నగర్. 1952లో మూడోశ్రేణి మున్సిపాలిటీగా అవతరించి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, 2025లో కార్పొరేషన్‌గా మారింది. అలాంటి మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు తొలిసారి ఎన్నికలు జరగుతున్నాయి. తొలి మేయర్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికార పార్టీ కాంగ్రెస్ యత్నాలు చేస్తోంది. రెండేళ్ల ప్రజారంజక పాలనపై హస్తంపార్టీ ధీమాగా ఉంది. ఇక బీసీ మహిళకు రిజర్వ్ అయిన మేయర్ పదవిసైతం రసవత్తరంగా మారనుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు పాలమూరు ఇజ్జత్ కా సవాల్. అక్కడి ఎమ్మెల్యే కాంగ్రెస్. స్వయంగా ముఖ్యమంత్రి సొంత జిల్లా కూడా. రెండేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని వివరించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని హస్తం పార్టీ భావిస్తోంది. ఇటీవలే రూ.603 కోట్లతో భారీ భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టు, రూ.220 కోట్లతో శాశ్వత తాగునీటి వ్యవస్థకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇవికాకుండా విద్యాహబ్‌గా మహబూబ్‌నగర్, వీధివీధికి సీసీ రోడ్లు, మౌలిక వసతులు, ఆరు గ్యారంటీల అమలు, వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన అంశాలను జనానికి వివరించి నగర పాలికలో పాగా వేయాలని అధికార పార్టీ పావులు కదుపుతోంది. బరిలో నిలిచేందుకూ కాంగ్రెస్ నుంచి అధిక సంఖ్యలో పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో బీ ఫాం దక్కక నిరాశకు గురైన అసంతృప్తులు ఆయా డివిజన్లలో కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారే అవకాశం కనిపిస్తోంది. మేయర్ అభ్యర్థిత్వానికీ హస్తం పార్టీలో తీవ్ర పోటీ ఉంది. మేయర్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో జనరల్, బీసీ జనరల్‌కు కేటాయించిన డివిజన్లలోనూ బీసీ మహిళల్ని రంగంలోకి దింపి మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్నారు. 60 డివిజన్లకుగాను 50కి పైగా సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ ధీమాగా ఉంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, అధికార కాంగ్రెస్ పార్టీ అప్పుడే తన ఖాతాను తెరిచింది. రాష్ట్రంలోని మూడు కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే మార్గం సుగమమైంది. మెదక్ మున్సిపాలిటీతో పాటు రామగుండం, పాలమూరు (మహబూబ్‌నగర్) కార్పొరేషన్లలో కాంగ్రెస్ బోణీ కొట్టింది. మెదక్ మున్సిపాలిటీలోని 32వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గోదల మానస సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.ఆమె గత ఎన్నికల్లోనూ ఇదే వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండుసార్లు ఇలా ఎన్నిక కావడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులుగా ఉన్న అత్త లక్ష్మి, బీఆర్ఎస్ అభ్యర్థి జ్యోతి తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మానస విజయం ఖాయమైంది.పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ 1వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మడిపల్లి విజయ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే, ఇక్కడ రాజకీయ రచ్చ మొదలైంది. కాంగ్రెస్ నాయకులు తమను బెదిరించి నామినేషన్లు విత్ డ్రా చేయించారని బీజేపీ అభ్యర్థి రీమా బిశ్వాస్ ఆరోపించారు. తన భర్తపై తప్పుడు కేసులు పెడతామని పోలీసులు బెదిరించారని ఆమె అదనపు డీసీపీకి ఫిర్యాదు చేయడం గమనార్హం.మహబూబ్‌నగర్ కార్పొరేషన్ 58వ డివిజన్ (రాజేంద్రనగర్) నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రమాదేవి ఎన్నిక లాంఛనమైంది. బీజేపీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఇక్కడ కూడా హస్తం పార్టీ జెండా ఎగిరింది. తెలంగాణ వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, 13న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# దేశాన్ని అమ్మేశారు..

>> కారణంగానే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం సోమవారం భారత్, అమెరికా ఒక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా, భారతీయ వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికన్ ఉత్పత్తులపై కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించడానికి భారత్ అంగీకరించింది. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని ఒత్తిడికి లొంగి ఈ ఒప్పందంపై సంతకం చేశారని ఆరోపించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోడీ తీవ్ర ఒత్తిడితో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోడీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. "మోడీ భయపడుతున్నారు. వాణిజ్య ఒప్పందం 4నెలలుగా నిలిచిపోయిందని అందరూ చూశారు; ఏమీ మారలేదు. మనకు తెలియని ఏదో కారణం వల్ల, నరేంద్ర మోడీకి తెలిసిన కారణం వల్ల, నిన్న సాయంత్రం నరేంద్ర మోడీ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారు. నరేంద్ర మోడీపై ఒత్తిడి ఉంది, మోడీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలిపోవచ్చు" అని ప్రతిపక్ష నేత వ్యాఖ్యానించారు. "మన ప్రధాని అమెరికా ఒత్తిడికి తలొగ్గారని, భారత ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోడీ అమ్మేస్తున్నారు" అని రాహుల్‌గాంధీ ఆరోపణలు గుప్పించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ మండిపడ్డారు. నాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్- అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్ర వెల్లడించాలని డిమాండ్ చేశారు.



మంగళవారం న్యూఢిల్లీలో ఎన్డీయె ఎంపీల సమావేశంలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా తదితరులు

# ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్

>> దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందన్నారు. మంగళవారం ఉదయం పార్లమెంట్ సెంట్రల్ హాలులో నిర్వహించిన ఎన్‌డిఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని మోడీ కీలక ప్రసంగం చేశారు. యూరోపియన్ యూనియన్, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలకు గాను ఎన్‌డిఎ కూటమి సభ్యులు ప్రధానమంత్రి నరేంద్రమోడీని అభినందిస్తూ, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎ ఎంపీలనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, ట్రంప్ విధించిన సుంకాలపై ప్రజలు తమను విమర్శించినా సహనంతో ఉన్నామని.. అదే తమను గెలిపించిందన్నారు. ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చల పట్ల ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోడీ విమర్శలు గుప్పించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని వివరించారు. స్థానిక సంస్థలతో సహా వివిధ ఎన్నికలలో సాధించిన విజయాలతో సంతృప్తి చెందవద్దని, మంచి పనులను కొనసాగించాలని మోడీ ఎన్‌డిఎ ఎంపీలకు సూచించారు. ఎన్‌డిఎ తన మంచి పనుల కారణంగా వరుసగా ఎన్నికలలో గెలుస్తోందని ప్రధానమంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలో లేకుండా ఎన్నికలలో గెలవలేమని ఆయన అన్నారు. మనం క్షేత్రస్థాయిలో ఉండి ప్రజల సంక్షేమం కోసం మంచి పనులు చేయాలి," అని ప్రధాని అన్నారు. "భారత్- అమెరికా, భారత్- యూరప్ మధ్య వాణిజ్య ఒప్పందానికి ఘనత ప్రధాని మోడీకే దక్కుతుంది. ఆయన సంకల్పం వల్లే ఇది సాధ్యమైంది. ఈ వాణిజ్య ఒప్పందం చిన్న తరహా వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూరుస్తుంది" అని పలువురు కేంద్ర మంత్రులు ప్రధాని మోడీని అభినందిస్తూ వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి బిజెపి, టిడిపి, జెడి(యు), ఎల్‌జెపి (ఆర్), శివసేన, జెడి(ఎస్), ఎన్‌డిఎలోని ఇతర భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలు హాజరయ్యారు.

# రిక్రూట్‌మెంట్ జీరో

>> భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు.జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని,ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు.తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు.కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ గారి పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు.ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు.మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

# సిఎం రేవంత్‌కు మంత్రుల అభినందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో లీడర్‌షిప్ ఇన్ ది 20 ఫస్ట్ సెంచరీ ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు అభినందించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, కొండా సురేఖ, అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సీఎం నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేశారు.

# ఓ జంట వినూత్న నిరసన

>> సరికాదని అన్నారు తాము పార్టీ నుండి నామినేషన్ కూడా వేసామని పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు కన్నీటి పర్యంతమయ్యారు తమకు న్యాయం చేయాలని కోరారు.

# విద్యార్థినేతల కిడ్నాప్

## ఎంబి యూనివర్సిటీ యాజమాన్యంపై ఆరోపణలు

## పోలీసులు రంగ ప్రవేశంతో కథ సుఖాంతం

### మోహన్‌బాబు, విష్ణుపై కేసులు నమోదు

**తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా తిరుచానూరుమార్గంలోని తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్ వి యూనివర్సిటీ నేత వినోద్ లు మంగళవారం మధ్యాహ్నం కిడ్నాప్ కు గురయ్యారు. ఈ ఇద్దరి విద్యార్థిసంఘాల నాయకులను మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు మార్గమధ్యంలోని కిడ్నాప్ చేసి వారిని సుదూర ప్రాంతంలో బంధించారు. ఈ సంఘటన పెద్దదుమారంతో కలకలం రేపింది. అసలు విద్యార్థినేతలను ఎందుకు కిడ్నాప్ చేశారనేది విద్యార్థులకు తెలియక ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్ సంఘటన జరిగిన సంఘటనను విద్యార్థి సంఘాల నేతలు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ మనోహారచారి రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంట వ్యవధిలో కిడ్నాప్ గురైన ఇద్దరు ఎస్ఎఫ్ఐ లీడర్లను రక్షించారు. అంతేకాకుండా కిడ్నాప్ చేసిన వారిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కిడ్నాప్‌ను ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సుబ్బరాయుడు, హామీ ఇచ్చారు.

సినీ నటుడు మోహన్ బాబు చంద్రగిరి పరిధిలోని ఎ.రంగంపేటలో ఎంబియూను నిర్వహిస్తున్నాడు. ఆ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అందిన ఫిర్యాదులు,వినతులతో న్యాయం కోసం విద్యార్థి సంఘాలు తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించే పనిలో కదిలింది. ర్యాలీగా వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోద్‌పై కలెక్టర్ కార్యాలయం వద్ద సినీ నటుడు మోహన్ బాబు అనుచరులుగా ఉన్న 30 మంది వేర్వేరు వాహనాలలో సినిమారీల్‌ను తలపించేలా ముందుకు ఉరికారు. అక్కడికక్కడే ఇద్దరు నేతల్ని వాహనాల్లో ఎత్తుకెళ్ళారు. దీంతో విద్యార్థులు మరింతగా రెచ్చిపోయారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎం నేత కందారపు మురళి వెంటనే రంగంలోకి దిగారు. కిడ్నాప్‌కు గురైన విద్యార్థులను కాపాడేందుకు పోలీసు అధికారులను సంప్రదించారు. వెంటనే జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అదనపు ఎస్పీ రవిమనోహరచారికి ఆదేశాలిచ్చారు. ఆయన వెంటనే బలగాలతో ఎంబియూ ప్రాంతానికి చేరుకుని కిడ్నాప్‌కు గురైన ఇద్దరు విద్యార్థినేతలను రక్షించి వారి చెర నుండి తీసుకువచ్చారు. విద్యార్థి నాయకులకు అపాయం తలపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని మోహన్ బాబుకు కందారపు మురళి హెచ్చరిక చేశారు. యూనివర్సిటీలో తప్పులు సరిదిద్దుకోమంటే దాడికి పాల్పడతారా అని ప్రశ్నించారు. అంతేగాక వెంటనే విద్యార్థులను పోలీసులు కాపాడటంతో తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు చివరకు ఎంబియూ నిర్వాహకులు మోహన్‌బాబు, విష్ణుపై కేసు నమోదు చేశారు.ఈ సంఘటనను పలువురు రాజకీయనేతలు, విద్యార్థిసంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయి.

# మణిపూర్ సిఎంగా యమ్నం ఖేమ్‌చంద్

## ఢిల్లీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శాసనసభా పక్షం

**ఇంఫాల్, ఫిబ్రవరి 3:** జాతుల వైరంతో రెండున్నరేళ్ల పాటు అట్టుడికిన ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లో ఇపుడు ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకూ కొనసాగిన రాష్ట్రపతి పాలన ముగియడంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అయింది. బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా మణిపూర్ ఎమ్మెల్యే యుమ్నం ఖేమ్‌చంద్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైన్మార్, బంగ్లాదేశ్‌లకు సరిహద్దుల్లో ఉన్న ఈ రాష్ట్రంలో వచ్చే 13వ తేదీనాటికి రాష్ట్రపతి పాలన అమలయి ఏడాది పూర్తవుతుంది. ఢిల్లీలో మణిపూర్ బిజెపి నేతలు ఎమ్మెల్యేలు, ఎన్డీయే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు సమావేశం అయి ఖేమ్‌చంద్‌ను శానసభా పక్ష నాయకునిగా ఎన్నుకోవడంతో కథ సుఖాంతం అయింది. మణిపూర్ కేంద్ర పరిశీలకులు తరుణ్‌చుఘ్, ఈశాన్యరాష్ట్రాల ఇన్‌ఛార్జి సంబిత్‌పాత్రాలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతుల వైరంతో అట్టుడికిపోయిన మణిపూర్‌ను చక్కదిద్దేందుకు 2025 ఫిబ్రవరినుంచి రాష్ట్రపతి పాలన విధించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి డికె అరుణ

# నేడు పాలమూరుకు బిజెపి చీఫ్ నితిన్ సిన్హా

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ జిల్లాకు భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నికైన నితిన్ నబీన్ మొదటిసారి పాలమూరుకు రానున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బిజెపి జాతీయ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ ఎన్నికలపై దిశా నిర్దేశం చేయనున్నారు. బూత్ స్థాయి కార్యకర్తల నుంచి జిల్లా నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి.. దాదాపు 25వేల మంది కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ మేరకు బుధవారం జరగనున్న సమావేశ ఏర్పాట్లను మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజా రెడ్డి, బిజెపి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నాయకుడు పోతుగంటి భరత్ తదితరులు పరిశీలించారు. మధ్యాహ్నాం మూడు గంటలకు జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు బిజెపి శ్రేణులు తరలిరావాలని కోరారు.

# హైకోర్టులో ఐ బొమ్మ రవి బెయిల్ పిటిషన్.. విచారణ వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలు, ఓటిటి కంటెంట్లను అధునాతన టెక్నాలజి ద్వారా పైరసీ చేసి ఏక ంగా పైరసీ సామ్రాజ్యాన్ని నెలకొల్పి, పోలీసులకు పట్టుబడి రెండు నెలలుగా జైల్లో వున్న ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి బెయిల్ కోసం హై కోర్టును ఆశ్రయించాడు. తనపై సిసిఎస్‌లో నమోదైన నాలుగు కేసులను కొట్టివేయాలని, తనకు వెంటనే బెయిల్ ఇవ్వాలని అతను హైకోర్టును వేడు కున్నాడు. పైరసీ సినిమాలను బెట్టింగ్ యాప్‌లకు అమ్ముకోవడం ద్వారా కోట్ల రూపాయలను సంపాంచిన రవి ఈ క్రమంలో బప్పం టివితో పాటు ఐ బొమ్మ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించి పైరసీ సినిమాలను అందులో ఉచితంగా చూపడం తెలిసిందే. దీంతో పాటు విదేశాల్లో ఆస్తులు సంపాదిం చి, భారత పౌరసత్వం వదులుకుని కరేబియన్ దీవుల పౌరసత్వం పొందాడు. తన నేర సామ్రాజ్యాన్ని కరేబియన్ దీవుల నుంచి కొనసాగించేవాడు.

రెండేళ్లకు పైగా సినీ రంగాన్ని తీవ్రంగా నష్టపరిచిన ఐ బొమ్మ రవిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు పక్కాగా వ్యూహం పన్ని అరెస్టు చేయడం విదితమే. ఇతనికి బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయి మళ్లీ రాడని పోలీసుల తరపున బలంగా వాదించడంతో ఇప్పటి వరకు బెయిల్ లభించలేదు. రవిపై మొత్తం నాలుగు కేసులను సిసిఎస్, సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో నమోదయ్యింది. నాంపల్లి కోర్టులో రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు వరుసగా డిస్మిస్ అవడంతో అతను మంగళవారం నాడు హైకోర్టులో బెయిల్ కోసం తన న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేయించాడు. ఈ పి టిషన్‌ను విచారించిన హైకోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేసి దీనిపై తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

# ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఎస్‌పిలు, కమిషనర్లు, ఎస్‌హెచ్‌ఒలతో డిజిపి విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికలు సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల ని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు, ఎన్నికలు జరిగే ప్రాంతాల స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్‌హెచ్‌ఒ)ను డిజిపి శివధర్ రెడ్డి కోరారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడా గొడవలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చేబట్టాలని ఆ యన ఆదేశించారు. మంగళవారం నాడు జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు, ఎన్నికల ప్రాంతాలలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మున్సిపల్ ఎన్నికలకు స ంబంధించి డిజిపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల లో ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరగనుండడంతో దీనికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించడంతో పాటు దీనిపై తగిన సూచ నలను చేశారు. 13వ తేదీన కౌంటింగ్ వుంటుందని దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా సవ్యంగా వుండాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలు ప్ర శాంతంగా జరగాలని, ప్రభుత్వానికి, పోలీసు శాఖకు ఎక్కడా చెడ్డపేరు రావద్దని ఆయన కోరారు. ఎన్నికల్లో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడా లని, ఓటర్ల నుంచి, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. నిబంధనల ప్రకారం పోలీసు లు ఎన్నికల విధులను కఠినంగా నిర్వహించాలని డిజిపి ఆదేశించారు. హైదరాబాద్ పోలీసు లీగల్ అడ్వయిజర్ శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాలు ఎలా వుంటాయో వివరించారు. ఎన్నికల్లో ఎవరూ ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాల్సి న బాధ్యత పోలీ సులపై వుందని, ఓటర్లపై ఎవరూ ఒత్తిడి చేయకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఓటర్లను ఎన్నికల సందర్భంగా సామాజిక బహిష్కరణ, ఆర్థి కంగా ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలపి ఆయన కోరారు. ఎక్కడా మద్యం పంపిణీ జరగకుండా చూడాలని, లైసెన్స్ కలిగి న ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని, ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ఎలా వ్యవహరించాలనే దానిపై ముందుగానే వెల్లడించాలని, వీ టిని ఉల్లంఘించే పార్టీలపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ ఎలాంటి సమావేశాలను నిర్వహిస్తే పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఎన్నికల్లో పాల్గొనే వారు వాహనాలను ఎంతమేరకు వినియోగించాలనే దానిపై చట్టంలో స్పష్టంగా వుందని, దీనిని ఎవరూ ఉల్లంఘించడానికి వీల్లేదని ఆయన తెలిపారు.



డిజిపి కార్యాలయం నుంచి జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిజిపి శివధర్ రెడ్డి

# కాకతీయ జూ పార్క్‌లో తెల్లపులి మృతి

**ప్రభాతవార్త సుబేదారి:** హనుమకొండ జిల్లా హంటర్ లోని కాకతీయ జూ పార్కులో 14 సంవత్సరాల తెల్ల పులి మరణించింది పులులు సాధారణ జీవిత కాలం 12 సంవత్సరాలు కానీ ఈ తెల్ల పులి 14 సంవత్సరాలు జీవించి వృద్ధాప్య, గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమైన విషయమని అటవీశాఖ అధికారి మయూరి తెలియజేశారు నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనట్లు తెలిపారు.



# చిరంజీవిని కలిసిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కలిశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న చిరు ఇంటికి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. తన వెంట తీసుకువచ్చిన ఆంజనేయుడి చిత్ర పటాన్ని ఆయనకు బహూకరించారు. కొండా సురేఖ తన కుమార్తె సుస్మితతో కలిసి మెగాస్టార్ ఇంటికి వెళ్లడం గమనార్హం. అయితే ఆమె ఎందుకు చిరంజీవిని కలిశారు అనేది మాత్రం వెల్లడించలేదు. పైగా ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన మంత్రి కొండా సురేఖ.. కేంద్ర మాజీమంత్రి అంటూ మెగాస్టార్ చిరంజీవిని సంబోధించడం గమనార్హం. చిరంజీవిని కలిసిన కొండా సురేఖ .. ఆయనకు ఇష్టమైన ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందించారు. ఆ తర్వాత కొద్దిసేపు చిరంజీవితో భేటీ అయ్యారు. కొండా సురేఖ వెంట ఆమె కూతురు కొండు సుస్మిత కూడా ఉన్నారు. చిరంజీవితో భేటీ అయిన వీడియో, ఫోటోలను మంత్రి తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక అదే పోస్ట్‌లో చిరంజీవిని ఆమె మాజీ కేంద్రమంత్రి అంటూ పేర్కొనడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.

# కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఎయిమ్స్

## 86శాతం పనులు పూర్తి, త్వరలో ప్రధానమంత్రి చే ప్రారంభం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**బీబీనగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** దేశంలోనే బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిని నెంబర్ వన్ ఆస్పత్రిగా, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళ వారం ఆయన సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ జిల్లాలో ఉన్నటువంటి ప్రజలకు సేవలు అందించేందుకు బీబీనగర్ లో రూ.1,110 కోట్ల వ్యయంతో 201 ఎకరంలో 750 పడగలతో అన్ని రకాల అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ ఆసుపత్రిని నెలకొల్పినట్లు తెలిపారు. ఓల్డ్ బిల్డింగ్ ఉండడం వల్ల పనులు సకాలంలో పూర్తికాలేకపోయాయని, దేశంలో గ్రీన్ఫీల్డ్ ఎయిమ్స్ లో ఉన్నప్పటికిని ఇక్కడ మాత్రమే బ్రౌన్ ఫీల్డ్ ఎయిమ్స్ నిర్మాణం జరుగుతుండటం ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు ఇప్పటివరకు రూ.831 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, 86!! పూర్తయినట్లు వివరించారు. మిగతా 14 శాతం పనులు పూర్తి చేసి 2026 చివరి వరకు ప్రధానమంత్రి మోడీ చే పూర్తిస్థాయి సేవలందించే ఆసుపత్రిగా ప్రారంభించుకోనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఆసుపత్రికి 1800 నుంచి 2000 మంది ఓపి పేషెంట్స్ వస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 250 పడగలతో సేవలందిస్తున్నట్లు, జనవరి ఒకటి నుండి అత్యవసర సేవలు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. రోగుల అటెండర్స్ కోసం అమృత నివాసం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్య సేవలు కూడా ఎయిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తాయని చెప్పారు. కొన్ని టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఎంఎంటీఎస్ పూర్తి అయితే పేషెంట్లకు సౌకర్యంగా ఉంటుందని, బీబీనగర్ లో లోకల్ రైలు ఆపే విధంగా చర్యలు తీసుకుంటామని, ఎయిమ్స్ సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని, 450 కోట్లతో ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్ట్ రాబోతుందని అది పూర్తయితే ఎయిమ్స్ సమీపంలో ఎంఎంటీఎస్ స్టాప్ కూడా ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో ఇప్పటివరకు ఉన్న భవనాలను రీ మోడలింగ్ చేసుకుంటూ అధునాతన మైన అన్ని వసతులతో కూడిన 24 బహుళ అంతస్తుల గల భవనాలను నిర్మించు కుంటున్నామని, ఇప్పటికీ ఎయిమ్స్ లో వెయ్యికి పైగా సిబ్బంది నియామకం జరిగిందని తెలిపారు.



మంగళవారం బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


BAJAJ FINANCE

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యువెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నాం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(11-03-26): అదిలాబాద్ - ద్వారకా నగర్; PEK4SGL15894719. ఆర్మూర్ - అంబేద్కర్ చౌరాస్తా; PB56SGL15804558, 15805333, 15915197, 16034596. బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL15604569, 15848835, 15847720, 15919034. భద్రాచలం - ఆర్‌టిసి బస్ స్టాండ్; PEK5SGL15873155, 15889498, 16011079, 16008436, 16030609. భోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL15915446, 16028940, 16106795, 16100022. భోంగీర్ - హైదరాబాద్ రోడ్; PCW1SGL15579766, 15988211. భూపాలపల్లి - మైన్ రోడ్; PCW2SGL15821772, 15870315, 16055363, 16073460, 16137960. (12-03-26) గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL15618355, 15806143, 15798004, 15836048, 15884622, 15911700, 16029572, 16096390. గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL15635648, 15684978, 15852067, 15897786, 15896700, 15930139, 16013810, 16033226, 16067929. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL15961245, 15995370, 16007004, 16075136. హుస్నాబాద్ - అక్కన్నపేట్ చౌరస్తా; PCW5SGL15781586. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; P86QSGL15694268, 15796298, 15829388, 15837424, 15962020, 16103023, 16119445, 16123713. కరీంనగర్ - సీవీఆర్ఎన్ రోడ్; PCW8SGL16119994. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL15801031, 15875451, 15887861, 16006490, 16066685. (13-03-26) ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL15607650, 15667231, 15807248, 15836190, 15909452, 15910600, 15972089, 16137077. కొంద - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL15600061, 15822909, 16106222. కోరుట్ల - బీజీఎల్; PV44SGL15623932, 15668875, 15741047, 15930156. కోస్గి - శివాజి చౌక్; PJH6SGL16076712, 16107391. కొత్తగూడెమ్ - మధుర బస్తి; PEJ5SGL16024768. మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరాస్తా; PMJ9SGL15929857. మంచెరియాల్ - హైదరాబాద్ రోడ్; PCW9SGL15575328, 15619458, 15937490, 15959993, 16150220. మనుగూరు - అశోక్ నగర్; PCX1SGL15864023. (16-03-26) మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PCX2SGL15646139, 15963253, 16047448, 16072286, 16096907. మెట్‌పల్లీ - మైన్ రోడ్; PEF7SGL15582310, 15776748, 15802001, 15852270, 15936648, 15961617, 15959350, 15962416, 16142602. మిర్యాలగూడ - బీజీఎల్; P7B7SGL15627401, 15812387, 15907559, 15935860, 15935292, 16058871. ములుగు - గాంధీ చౌక్; PJV5SGL15598069, 15694482, 15710150, 15797551, 15850092, 15868363, 16075242. నాగర్‌కర్నూల్ - బీజీఎల్; P21DSGL15671223, 15656304, 15989395. నల్గొండ - ఆర్‌పీ రోడ్; P558SGL15752167, 15876509, 16025661. నారాయణ్‌పేట్ - సర్కిరెడ్డి చౌరాస్తా; PJH5SGL14394068, 15780414, 16145110. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PCX3SGL15625463, 16025139. (17-03-26) నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL15766798, 15805775, 15989137, 16004592. నిజామాబాద్ - కపిల హోటెల్ రోడ్; PB94SGL15784763, 15857169, 15913937, 15981992. నిజామాబాద్ - వినాయక నగర్; PCX5SGL15597519, 15807773, 15831360, 16101898. పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL15606573, 15647687, 15698836, 15721265, 15876293, 15907525, 15960688, 15983284, 16057989, 16054964, 16097906, 16093147, 16115957, 16123673, 16128954. పట్టన్‌చెరు - మేధా హాస్పిటల్ రోడ్; PMT4SGL16115868. పట్టన్‌చెరు - బీజీఎల్; PNY4SGL15936222. పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL15597991, 15601298, 15648832, 15754683, 15797504, 15991948, 16032508, 16027064. సదాశివపేట్ - రాచయ్య నగర్; PCX6SGL15810239, 15823209. (18-03-26) షహద్‌నగర్ - వెంకటేశ్వర కాలోని; PCX7SGL15581685, 15593193, 15777472, 15777827, 15936433, 16011087, 16051589. సంగారెడ్డి - బీజీఎల్; P4D3SGL14892498, 15698395, 15697892, 15917603, 15928023, 15934384. సంగారెడ్డి - పాత బస్ స్టాండ్; PJG6SGL15796887, 16026605. సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL15607705, 16026127. శంశాబాద్ - బీజీఎల్; PY30SGL15656568, 15797284, 15864244. సిద్దిపేట - మెదక్ రోడ్; PGM8SGL15605255, 15716896, 15717736, 15803476, 15831098, 15892520, 15914478, 15918052, 15988909. సిరిసిల్ల - మెయిన్ రోడ్; PB66SGL15765147, 15807965, 15866048, 16093131. సూర్యపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL15593299, 15593166, 15643455, 15752963, 15867664, 15875149, 15890960, 15911585. (20-03-26): తాండూర్ - ఇందిరా చౌక్; PDA6SGL15887495. తూప్రాన్ - రామాయపేట్ రోడ్; PJT5SGL15826510, 15851929, 15866743. తుర్కయంజాల్ - రాఘవేంద్ర నగర్; PLP1SGL15578209, 16008704, 16037163. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL15578314, 15596571, 15764616, 15778145, 15799303, 15869230, 15964310. వరంగల్ - కెయు క్రాస్ రోడ్; PGP7SGL15870040. వరంగల్ - స్టేషన్ రోడ్; P04ISGL15639170. వరంగల్ - సూబేదారి; PB55SGL15932138, 15970521, 16047767. యెల్లందు - బుగ్గవాగు; PGC4SGL14794057, 15600452.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# జెండా మోసిన కార్యకర్తలకు టికెట్లు దక్కలేదు: మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

**.జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** కాంగ్రెస్ పార్టీ జెండామోసి కష్టకాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు మున్సిపల్ కౌన్సిలర్ టికెట్ రాకపోవడం ఏమిటని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానం పై మండిపడ్డాడు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో మాజీ మంత్రి వర్యులు తాటి పర్తి జీవన్ రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జగిత్యాలకు వచ్చిన మిత్రుడు ఎంతటి వారైనా పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని అన్నారు..నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ పార్టీ తో అనుబంధం ఉంది అని నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఒడిదుడుకులు చూసిన. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అన్నారు.జగిత్యాల లో 2019 మినహా అన్ని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది అన్నారు.ప్రవాహానికి ఎదురీత లో కూడా జగిత్యాల రాయికల్ మున్సిపల్ లో కార్యకర్తలు పట్టుదలతో పోటీ చెసి, కాంగ్రెస్ పార్టీ కి అండగా నిల్చున్నారు వారికి ఇప్పుడు అన్యాయం జరిగింది అన్నారు.టీ ఆర్ ఎస్ పాలనలో దశాబ్ద కాలం పోరాటం చేసినం కానీ వారే ఇప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం ఉన్నారుప్రస్తుతం జగిత్యాల మున్సిపాలిటీ లో 50 వార్డుల్లో కనీసం 40 గెలుపొందుతాం.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది.. కాబట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు..టిక్కెట్లు ఆశించడం తప్పు కాదు అన్నారుకాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేసి, కాంగ్రెస్ జెండా మోసిన వారి పేర్లను ప్రతిపాదించాం వారి పేర్లు మొత్తం పక్క కట్టడం సమంజసమేన అన్నారుఅభ్యర్థులు ఎవరైనా.. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికే టిక్కెట్లు ఇవ్వాలని కోరుకున్న కానీ అలాంటిదే జరగలేదు అన్నారుఉత్తమ్ కుమార్ రెడ్డి కి జాబితా అందజేసిన కానీ వారికే టికెట్లు రాకపోవడం బాధాకరమన్నారు కాంగ్రెయు పార్టీ నిబద్ధత గా రాజకీయ పార్టీ.. రాహుల్ గాంధీ ఆలోచన కు అనుగుణంగా.. రాజ్యాంగా నిబంధనలు కు అనుగుణంగా కొనసాగుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారుజగిత్యాల ఎమ్మెల్యే.. బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే.. పార్టీ ఫిరాయింపు చట్టం కింద నోటీసు ఇవ్వగా.. స్పీకర్ కు తాను బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే అని అఫిడవిట్ ఇచ్చారు అందరికీ తెలిసిందే కదా అన్నారుఇటీవల ఎమ్మెల్యే సంజయ్ గాంధీ భవన్ కు రావడం పై నిలదీసిన తెలిపిన అధిష్టానం ఎందుకు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారుబీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేను కూర్చోబెట్టుకొని మున్సిపల్ ఎన్నికల టికెట్ల పై చర్చించడం ఏమిటి..క్రమశిక్షణ ఎవరు ఉల్లంఘిస్తున్నారు. తెలుపాలని పేర్కొన్నారుదేశం అంతా రాజ్యాంగ పరిరక్షణ పాటుపడటమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని రాహుల్ గాంధీ పిలుపు నిచ్చారు కానీ జగిత్యాలలో దానికి విరుద్ధంగా నడుస్తుంది అన్నారుఐదేళ్లు శాసన మండలిలో ఒంటరిగా పోరాటం చేసిన అందరికీ తెలియదా అన్నారుబీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే తో చర్చించి జాబితా రూపొందించడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారుకాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారి గతి ఏమి కావాలి కార్యకర్తలు పార్టీని నమ్ముకుని జీవితాలు ద్వారపోసి ఆర్థికంగా నష్టపోయి కాలం నష్టపోయి కుటుంబాన్ని నష్టపోయి న కార్యకర్తలు రోడ్డుపైన పడితే దీనికి బాధ్యులుఎవరని పేర్కొన్నారుపదేళ్లు కష్టపడిన కార్యకర్తల తినే కాడి పళ్ళెం లాకెళ్ళితే ఎంత ఆవేదన ఉంటది అర్థం చేసుకోవాలని పేర్కొన్నారుఫైనల్ జాబితా..

చేర్పులు మార్పులు ఏమిటి..పార్టీ లో ఏం జరుగుతోంది అర్థం కావడం లేదు అన్నారుమున్సిపల్ అధికారులు ప్రకటిస్తే గానీ ఎవరు కాంగ్రెస్ అభ్యర్థి అనేది తెలిసేలా లేదు అన్నారు.క్రమశిక్షణ గల కార్య కర్తగా రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా మాట్లాడటమే నేను చేసిన తప్పా తప్పయితే నాకు శిక్ష విధించండి అన్నారు.



మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

# జనగామ జిల్లాలో పెద్దపులి సంచారం- అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామం మీదుగా పెద్దపులి జనగామ జిల్లాలోకి ప్రవేశించినట్లు సమాచారం. దీంతో అటవీశాఖ, పోలీసుశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. వన్యప్రాణుల కదలికలపట్ల అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ అధికారులు ప్రస్తుతం పులి పాదముద్రలను సేకరించి దాని కదలికలను గమనిస్తున్నట్లు సమాచారం. ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామానికి దగ్గరలోని వ్యవసాయ దడిగోని బావివద్దకు పెద్దపులి ఉదయం సంచరించినట్లు తెలిసింది. ఈసందర్భంగా డీఎఫ్ఓ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులికోసం రెండుబోనులు ఏర్పాటుచేశామని, యాదాద్రి భువనగిరి జిల్లాల సరిహద్దు వద్ద ఒకటి, జనగామ జిల్లా సిద్దెంకి వద్ద మరొకటి బోను ఏర్పాటు చేశామని తెలిపారు.

పులి లేదా చిరుతపులి సంచారం ఉన్నప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యవసరమని, అడవి లేదా పొలాల వద్ద ఎవరూకూడా ఒంటరిగా వెళ్లకూడదని, గుంపులుగా వెళ్లాలని, పులి ఎదురైతే పరిగెత్తకుండా కళ్లలోకి చూస్తూ వెనక్కి నడవాలని, చప్పుడుచేయడం, తలపై ముసుగు ధరించడం, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపించకూడదని,

సాయంత్రం వేళల్లో బయట తిరగకుండా జాగ్రత్తపడాలన్నారు. పులి అడుగుజాడలు లేదా ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

వార్త

జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజనీయులుగా చూడలేనివారు దైవారాధన చేయడం శుద్ధ దండగ.

-సెక్కన్

# అడుగంటుతున్న భూగర్భజలాలు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడుంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడ తెగక పారు యేరు..'ఉన్నచోటే ఎంపిక చేసుకోమన్నాడు సుమతీ శతకకారుడు. బర్రె పోతేకానీ పాడి సంగతి తెలియదంటారు. బావి ఎండిపోతే నీటి విలువ తెలుస్తుంది. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఎంతో సాధించామని చెప్పుకుంటున్నా ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని నీటి సమస్య పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదని చెప్పడం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు, పెడుతున్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్రస్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. గత రెండు, మూడేళ్లుగా వర్షాలు కొన్ని ప్రాంతాల్లో అవసరానికి మించి పడుతున్నాయి. దేశవ్యాప్తంగా చూసినా వర్షాలు ఈ యేడాది సమృద్ధిగానే కురిసినట్టు అధికార లెక్కలు చెప్తున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి కురువగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాకాలంలో కూడా నీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశవ్యాప్తంగా దాదాపు రెండువందల జిల్లాల్లో తక్కువ వర్షపాతం కురిసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలున్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్నది. విద్యుత్ డిమాండ్‌తోపాటు నీటి వృధా కూడా పెరుగుతున్నదనే చెప్పొచ్చు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ నీటివృధాను భారీగా పెంచుతున్నది. మరొకపక్క తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా భారత్‌లో యేటా 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏదో నామమాత్రపు నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. వాస్తవంగా దేశంలో ఆరు వేల ఐదువందల డెబ్భైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులను అవసరానికి మించి వాడుతున్నారు.పరిస్థితి ఇలాగేకొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విధానాల వల్ల సన్నకారు, చిన్నకారు,మధ్యకారు రైతులు కొంతమేర లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో యాభైశాతం, రాజస్థాన్‌లో అరవైశాతం,కర్ణాటక,తమిళనాడులో నలభైశాతం భూగర్భ జలాలు అధికంగా వాడుతున్నట్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో ఇష్టానుసారంగాలక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా దేశంలో 250 జిల్లాల్లో ఇనుము, 228 జిల్లాల్లో ఫ్లోరైడ్, 129 జిల్లాల్లో క్షారత్వం, 39 జిల్లాల భూగర్భజలాల్లో పాషాణం స్థాయి అధికంగా ఉన్నట్లు కేంద్రం గతంలో వివరించింది. ఇక పాతాళంలోకి దిగజారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వాడకం పెరిగిపోతున్నది. ఇంకొకపక్క రాబోయే వేసవిలో మంచినీటి కొరతను ఆసరాగా చేసుకొనికొందరు దళారులు వ్యాపారం విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది.ఇప్పుడు ఈవ్యాపారం నగరాలకేకాక,మండల కేంద్రాలకు,గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగించేవారు లేకుండాపోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు.ఇంకొకపక్క లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ప్రజల్లో అవగాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచేపటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలుచేపట్టాల్సిన అవసరం ఉంది.

> సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

> గతంలోని వైఫల్యాలు భవిష్యత్తులో విజయాలకు మార్గం సుగమం చేస్తాయి.



సిసి కోల్టన్

# ప్రజావాక్కు



### పాజిటివ్ దృక్పథం అవసరం

విద్యార్థి పరీక్షల్లో పాస్ అయినా వ్యాపారికి వ్యాపారంలో లాభం వచ్చినా నిరుద్యోగికి మంచి ఉద్యోగం ఒరొకినా ఎన్నికల్లో ఏదైనా రాజకీయపార్టీ గెలిచినా ఎంతో ఆనందిస్తారు. వారి ఆనందానికి పట్టపగ్గాలు ఉండవు. స్నేహితులని, చుట్టాలని ఇరుగుపొరుగు వారిని కలిసి వీరితో తమ ఆనందాన్ని పంచుకుంటారు. అందిరికి మిఠాయి తినిపిస్తారు. వ్యతిరేకంగా జరిగితే తీవ్ర నిరాశకు గురవుతారు. సర్వం కోల్పోయినట్లు బాధపడుతుంటారు. అలాగే ఆటలో క్రీడాకారులు విజేతగా నిలిచినా ఇలానే ఉంటుంది. సంతోషంతో గంతులు వేస్తూ మైదానంలో తిరుగుతారు. సంతోషంలో వారికి మాట కూడా తడబడుతుంది. ఓడినప్పుడునీరసపడుతుంటారు.అయితే ఇలాఎవరూ ప్రవర్తించకూడదు. మనిషి జీవితం అంటేనే సుఖదుఃఖాలు.

- మిథునం, హైదరాబాద్

### సాదాబైనామా వర్తింప చెయ్యాలి

రెండువేల పదిహేను సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని42గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం జరిగింది. 2020 అక్టోబర్, నవంబర్ నెలలో భూమి పాస్ బుక్ కానీ రైతులు, సాదబైనామా ద్వారా కొనుగోలు చేసినవారికీ, పాస్‌బుక్‌ల కోసం అప్లై చేసుకోమని అప్పటి తెరాస ప్రభుత్వం చెపితే, మీ సేవ లో కొన్ని వేల మంది రైతులు, కొన్ని వేల ఎకరాల భూమి పాస్ బుక్‌ల కోసం అప్లై చేసుకున్నారు. ఇప్పుడు కోర్టు స్టేఎత్తి వేసిన పిదప 42 గ్రామాల రైతులకు వర్తించదు, అని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. విలీనమైన గ్రామాలలోని, రైతుల వ్యవసాయ భూములకు కూడా వర్తింపా చేయాలి.

- బీరం రాములు, వరంగల్

### ఆచరణ ఏదీ?

అత్యున్నత పదవిలోఉన్నవారుఅట్టడుగుస్థాయిలోని వారు వారని వీరని కాదు ఏ ఒక్కరు సంయమనం పాటించడం లేదు. తరచు ఆగ్రహావేశాలను ప్రదర్శిస్తూ ఒకరిపై ఒకరు విరుచుకుపడుతున్నారు. ఇష్టమొచ్చినట్లు తిట్టుకుంటున్నారు.ఈవిషయంలో ఏఒక్కరు తగ్గడం లేదు.ఈతిట్లు జుగుప్సాకరంగా కర్ణకఠోరంగఉంటున్నాయి.మహిళలను వయసులో పెద్దవారినీ వీరు వదలటం లేదు. మహాత్మాగాంధీ, గౌతమ బుద్ధుడు, ఆదర్శంగా తీసుకోవాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఇక గాంధీ ముక్త భారతేనా?

జవహర్‌లాల్‌నెహ్రు గాంధీకి అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూతో కలిసి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటం చేశారు.ఆ తరువాత గాంధీ మద్దతుతో నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు. నెహ్రుకి కుడి భుజంలా ఉండి సలహాలు, సూచనలు ఇచ్చేవారు.నెహ్రూకి కూడా గాంధీ అంటే వల్లమాలిన అభిమానం, గౌరవం. ఈ కారణంతోనే నెహ్రూ తన కుమార్తె పేరుకి చివరన గాంధీని చేర్చారు. ఆ తరువాత ఈ ఆనవాయితీ కొనసాగుతూవచ్చింది. అయితే నెహ్రూ అంటే ప్రస్తుత పాలకలకు అసలు గిట్టదు. అతి చాలక నెహ్రూ కుటుంబంతో ఇప్పుడు ఎంతో మంది గాంధీలు ఉన్నారు. వారందరు ప్రస్తుత పాలకులకు ప్రత్యర్థులు.

- శాస్త్రి, హైదరాబాద్

### డిజిటల్ విప్లవం

డిజిటల్ విప్లవం మన జీవనశైలిని సులభతరం చేసినప్పటికీ, మానవ సంబంధాల మధ్య పెను మార్పులను తీసుకువచ్చింది. ప్రపంచం మన గుప్పిట్లోకి చేరిందన్న సంతోషంలో, పక్కనే ఉన్న మనుషులకి మనం దూరమవుతున్నాం. ఒకే గదిలో ఉన్నా, భోజన టేబుల్ వద్ద కూర్చున్నా సంభాషణల కంటే మొబైల్ నోటిఫికేషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నాం. స్నేహితులతో ముఖాముఖి కలిసే సందర్భాలను వీడియో కాల్స్, ఎమోజీలు భర్తీ చేస్తున్నాయి,దీనివల్ల భావోద్వేగాల్లో లోతు తగ్గి సామాజిక వియోగం ఏర్పడుతోంది.వందల కొద్దీ సోషల్ మీడియా స్నేహితులు ఉన్నా, మనసువిప్పి మాట్లాడుకునే వారు కరువవుతున్నారు. వర్చువల్ ప్రపంచంలోని కృత్రిమ జీవనశైలితో పోల్చుకుంటూ యువత ఆందోళన, ఒంటరితనం వంటి మానసిక సమస్యల బారిన పడుతున్నారు. నిజానికి సమస్య సాంకేతికతలో లేదు, మన వినియోగ విధానంలోనే ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బదలీ అయినవారికి పోస్టింగ్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్నప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదలీలను నిర్వహించిన వారికి వెంటనే పోస్టింట్ ఇవ్వాలి.పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడివారిన అక్కడే ఉంచినట్లయితే బదలీలు వృధా అవుతాయి. కొంత మందికి పోస్టింగ్ ఇచ్చి మరికొంత మందికి ఇవ్వకపోవడం బాధాకరం. బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలి. మోడల్ స్కూల్స్ సిబ్బందికి అవకాశాన్ని కల్పించాలి.ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మున్సిపల్ గెలుపే రాజకీయ దిశానిర్దేశం!

**తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు,స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానికఅభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతి కూలంగా మారేఅవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీకంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలున్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ ఎస్,బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేకజాగ్రత్తలు తీసుకుం టున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం,సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగేఅవకాశాలున్నాయి.**

రామ కిష్టయ్య సంగన భట్ల

తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యం రాష్ట్ర రాజకీయాలను మరో కీలక మలుపు వద్ద నిలబెడుతోంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలుగాభావించే మున్సిపల్ ఎన్నికలు ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు, అలాగే బీజేపీకి రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.2023అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు అనంతరం తొలిసారిగా పట్టణ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కొలిచే అవకాశం రావడంతో ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ పాలనకే పరిమితం కాకుండా, రాష్ట్రస్థాయి రాజకీయ బలాబలాలను నిర్ణయించే పరీక్షగా మారాయి. అందువల్లే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు మినీ అసెంబ్లీ ఎన్నికలుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.తెలంగాణలో మున్సిపల్ పాలనకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. హైదరాబాద్‌తోపాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రామగుండం వంటి పట్టణ కేంద్రాలు ఆర్థికంగా, జనాభా పరంగా విస్తరించాయి. 2011 జనగణన ప్రకారం తెలంగాణలో పట్టణ జనాభా సుమారు 38 శాతంగా ఉండగా, తాజా అంచనాల ప్రకారం ఇది 42శాతానికి చేరువవుతోంది. అంటే రాష్ట్ర రాజకీయాల్లో పట్టణ ఓటర్ల పాత్ర రోజురోజుకీ పెరుగుతోంది. ఈ పట్టణ ఓటర్లే మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ అసంతృప్తి లేదా మద్దతును నేరుగా వ్యక్తంచేసే స్థితిలో ఉన్నారు. గత దశాబ్దంలో తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే, అవి రాష్ట్ర రాజకీయాలకు సూచికలుగా ఎలా మారాయో స్పష్టంగా తెలుస్తుంది. 2019-20లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది.141మున్సిపాలిటీల్లో 88కి పైగా చోట్లబీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగింది. ఆ ఫలితాలు తరువాత జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ రాజకీయ వేడిని పెంచాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు బీజేపీ ఎదుగుదలకు వేదికగా మారగా, బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఈ పరిణామాలన్నీ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను ఎలా ప్రభావితం చేస్తాయో అప్పుడే నిరూపించాయి.ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకడం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పు. ఈ నేపథ్యంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజల ముందుకు వెళ్లే ఈఎన్నికల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, పాలన శైలి నేరుగా ప్రజా తీర్పుకు లోనవుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఈఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మున్సిపల్ ఎన్నికలు రెండు విధాలుగా కీలకం. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ప్రజాభిమానాన్నిపట్టణ స్థాయిలోనూ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో బలంగాఉన్న పట్టణస్థానిక సంస్థలపై తన పట్టుసాధించాల్సిన రాజకీయ అవసరం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 142 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో అధిక భాగం ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభావంలోనే ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో తన సామర్థ్యాన్ని చూపించాల్సి ఉంటుంది.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పట్టణ ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం పొందాయన్నది కూడా ఈ ఎన్నికల్లో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత




బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, జీవన వ్యయం, ఇంధన ధరలు, అద్దె భారం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలపై ప్రజల స్పందన కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పునరుజ్జీవనానికి అవకాశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత అసంతృప్తులు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నైరాశ్యం వంటి పరిస్థితుల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు పరీక్షగా నిలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు ఉన్న పార్టీగా పేరున్న బీఆర్ఎస్, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తన రాజకీయ స్థితిని తిరిగి బలపరుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ పట్టణాల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గణనీయమైన ఓటు బ్యాంకు ఉందన్న అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వ్యూహం ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల చుట్టూ తిరగనుంది. అధికారంలోకి వచ్చి తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపణలు చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు తన రాజకీయ ప్రాధాన్యత ఇంకా తగ్గలేదని నిరూపించుకునే వేదికగా మారాయి. మూడవ ప్రధాన పార్టీగా బీజేపీ కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధించిన బీజేపీ, పట్టణ ఓటర్లలో తన పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాల్లో తన ప్రభావాన్ని విస్తరించేందుకు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యపోటీని ఆసరాగా చేసుకుని కొన్ని పట్టణాల్లో కీలకపాత్ర పోషించాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకువచ్చే అంశాలు పట్టణ జీవనానికి నేరుగా సంబంధించినవే. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్తనిర్వహణ, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక లోపాలువంటి సమస్యలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొన్ని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అనేకచోట్ల అసమాన అభివృద్ధి జరిగిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నది ప్రజల తీర్పులో కీలకంగా మారనుంది.గణాంకాల పరంగా చూస్తే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యత మరింత స్పష్టమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి సుమారు 3,500కు పైగా వార్డులు ఉన్నాయి. ఒక్కోవార్డులో సగటున 3,000 నుంచి 5,000వరకు ఓటర్లు ఉంటారు. అంటే దాదాపు కోటిమంది పట్టణ ఓటర్లు నేరుగా ఈఎన్నికల్లో పాల్గొంటారు. ఈస్థాయి ఓటర్ల అభిప్రాయం రాష్ట్రరాజకీయాలకు స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది. అంతేకాదు,ఈఎన్నికల ద్వారా వేలాది మంది ప్రజాప్రతినిధులు ఎంపిక అవుతారు. వీరిలో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే నాయకులు ఉండే అవకాశం ఉంది.అందువల్ల అన్నిపార్టీలు ఈ ఎన్నికలను నాయకత్వ తయారీవేదికగాకూడా చూస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు,స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానికఅభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతికూలంగా మారేఅవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీకంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలున్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేకజాగ్రత్తలు తీసుకుంటున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం,సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగేఅవకాశాలున్నాయి. అధిక ఓటింగ్ ప్రభుత్వంపై అసంతృప్తిని సూచిస్తుందా లేక ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుందా అన్నది ఫలితాల అనంతరం విశ్లేషణకు అంశంగా మారనుంది. ●

# ప్రాణాల కంటే హక్కులే ముఖ్యమా?

తిప్పర్తి శ్రీనివాస్

దేశవ్యాప్తంగా వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకప్పుడు అరుదుగా వినిపించిన కుక్కల కాట్ల ఘటనలు, నేడు నిత్య వార్తలుగా మారాయి. చిన్నారులు, వృద్ధులు, పాదచారులు, కార్మికులు ఎవరూ మినహాయింపు కాదు. గాయాలపాలవుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, కొన్నిసందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇది కేవలం జంతు సమస్య మాత్రమే కాదు, ఇది ప్రజారోగ్యం, భద్రత, పాలనకు సంబంధించిన అత్యంత కీలక అంశం.కుక్కలుకరవడం కొత్త విషయం కాదు. అయితే ఇటీవలకాలంలో ఈ ఘటనలు అసాధారణంగా పెరిగాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధుల్లోకుక్కల గుంపులు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో బయటకు రావడానికే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. స్కూల్‌కు వెళ్లే పిల్లలు, పనికి వెళ్లే మహిళలు,వృద్ధులు తమ ప్రాణభద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, మున్సిపల్ సంస్థలు తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. జంతు జనాభా నియంత్రణ, టీకాలు, ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రణాళికలున్నా,అమలు లోపించడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. ఇలాంటి నేపథ్యంలో వీధి కుక్కల నిర్వహణపై సుప్రీంకోర్టు కొన్ని కీలక సూచనలు చేయడం గమనార్హం. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, స్థానికసంస్థలు బాధ్యత తీసుకోవాలని, నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ సూచనలను జంతు ప్రేమిక సంఘా



లు తీవ్రంగా ఖండించడం మరో వివాదానికి దారి తీసింది. జంతు ప్రేమికుల వాదన కూడా పూర్తిగా విస్మరించదగినది కాదు. కుక్కలు కూడా జీవులు, వాటికి జీవించే హక్కు ఉందని వారు అంటున్నారు.అక్రమంగా లేదా అమానుషంగా కుక్కలను చంపడం మానవత్వానికి విరుద్ధమని హెచ్చరిస్తున్నారు. కుక్కలను చంపితే కేసులుపెడతామన్నహెచ్చరికలూ వినిపిస్తున్నాయి. కానీ ఇక్కడ ఒక కీలకప్రశ్న తలెత్తుతోంది. జంతు హక్కుల పేరుతో మానవ ప్రాణాల విలువను తక్కువ చేయవచ్చా? మానవ జీవితం అత్యున్నతమైనది అనే సత్యాన్ని ఎవ్వరూ విస్మరించలేరు. ఒకచిన్నారి ప్రాణం పోయిన తర్వాత, కుక్కలకూ హక్కులున్నాయి అనే వాదన బాధిత కుటుంబాలకు ఓదార్పునిస్తుందా? జంతు ప్రేమ మానవ భద్రతను మింగేయకూడదు. ఇక్కడ అవసరమైంది వైఖరులు కాదు, సమతుల్య దృక్పథం.వీధి కుక్కల సమస్యకు పరిష్కారం కేవలం చంపడంలో లేదు, అలాగే పూర్తిగా వదిలేయడంలో కూడా లేదు. శాస్త్రీయంగా, మానవీయంగా సమస్యను ఎదుర్కోవాలి. జనాభా నియంత్రణ కోసం సమర్థవంతమైన స్టెరిలైజేషన్ కార్యక్రమాలు, నిరంతర టీకాలు, ప్రత్యేక ఆశ్రయ కేంద్రాల ఏర్పాటు, చెత్త నిర్వహణలో క్రమశిక్షణ ఇవన్నీ సమగ్రంగా అమలుచేయాల్సినఅవసరంఉంది. కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా బాధ్యతతో వ్యవహరించాలి.జనసాంద్రత ఉన్నప్రాంతాల్లో గుంపులుగా ఆహారం పెట్టడం ప్రమాదాలకు దారితీస్తుందన్న అవగాహన కల్పించాలి.ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, జంతు ప్రేమికులు, ప్రజలు అందరూకలిసి ఆలోచించినప్పుడేపరిష్కారంసాధ్యం. ఒకరి మీద ఒకరు నిందలువేయడంవల్ల సమస్య పరిష్కారంకాదు. ప్రజల ప్రాణభద్రతతో రాజీపడకుండా,జంతువుల పట్లమానవత్వాన్ని కాపాడటం సాధ్యమే. చివరగా ఒక మాట వీధి కుక్కల సమస్యమన నాగరికతకు పరీక్ష. ఈపరీక్షలో మనం మానవత్వాన్ని కోల్పోకుండా, మానవ జీవితాన్ని కాపాడగలిగితేనే నిజమైన పరిష్కారం సాధించినట్టవుతుంది. ●

# బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం!

బొల్లిముంతసాంబశివరావు

నేడు ప్రపంచంలో బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం కొనసాగుతున్నది. ఈఆధిపత్యంలో అమెరికా సంస్థలు అగ్రస్థానంలో ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతకాలంలో సామ్రాజ్యవాద శక్తికింద ఉన్న అనేక ప్రాంతాలు స్వయం పాలన పొందాయి. అమెరికా దాని దిగ్గజ సంస్థల ద్వారా అతిపెద్ద పారిశ్రామిక శక్తిగా అవతరించింది. ఈకార్పొరేట్లు తమ అనుబంధ సంస్థల ద్వారా వెనుకబడిన దేశాలకు మూలధనం ఎగుమతి చేయడం ప్రారంభించాయి. అమెరికా ఇప్పుడు దాని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్డిఐ) ద్వారా మూలధనాన్ని ఎగుమతిచేసే అత్యంత ఆధిపత్య దేశంగా మారింది. బహుళజాతి సంస్థలకు లాభాలు పెంచుకునే ఉద్దేశమే ప్రధానమైంది. లాభాలను తమదేశాలకు తరలించుకుపోవడం, రాయిల్టీ చెల్లింపులు, కమీషన్లు సాంకేతిక కన్సల్టెన్సీ రుసుముల ద్వారా బహుళజాతి సంస్థల దోపిడీ కొనసాగుతున్నది.ఇప్పుడు బహుళజాతి సంస్థలఆర్థికదోపిడీని నయావలసవాదంలేదానయాసామ్రాజ్యవాదంగావెనుకబడినదేశాలకువిస్తరింపచేశారు. తమశాఖల అనుబంధ సంస్థల ద్వారా వివిధ దేశాల పారిశ్రామిక మార్కెటింగ్ ప్రాంతాల్లో తమ కార్యక్రమాలను విస్తరించుకుంటాయి. అనేకరంగాల్లో పెద్దఎత్తున ఉత్పత్తులు చేస్తూ అనేక దేశాలపై వ్యాపార వ్యూహాన్ని విస్తరిస్తాయి. 1990 ప్రారంభంలో 37 వేల బహుళజాతి కంపెనీలు అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థను ఆక్రమించాయి. ఈకంపెనీలు భారీమొత్తంలో ఆర్థికవనరులు కలిగి ఉన్నాయి. 200వందల అగ్రశ్రేణి బహుళజాతి కంపెనీలు (ఎంఎన్సి)సంపాదించిన ఆదాయం 1982లో 3,046 బిలియన్ల డాలర్ల నుండి 1992నాటికి 5,862 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈకాలంలో ప్రపంచ జీడీపీలో బహుళజాతి సంస్థల వాటా 24.2 శాతం నుండి 26.8శాతానికిచేరింది. 1992లో బహుళజాతి సంస్థల మొత్తం లాభాలు 73.8 బిలియన్డాలర్లు. ఇందులో అతిపెద్ద 10బహుళజాతి సంస్థల వాటా 38.8 బిలియన్డాలర్లు. (అంటే 47శాతం) నేడు ప్రపంచంలో బహుళజాతి సంస్థల సంఖ్య 60 వేలుదాటింది.స్వాతంత్ర్యం వచ్చినదగ్గర నుంచిప్రపంచంలోని వివిధదేశాల నుంచి ముఖ్యంగా అమెరికానుంచి విదేశీ సహకారాల రూపంలో బహుళజాతి సంస్థలు భారతదేశంలోకి ప్రవేశించాయి. దేశ పాలకులు వాటిని ఆహ్వానించారు. భారత ఆర్థిక వ్యవస్థలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించడం, దేశ ఆర్థికవ్యవస్థపై దాని దుష్ప్రభావం వెడల భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పాలకుల విధానాల వల్ల నేడు భారత ఆర్థికవ్యవస్థపై బహుళజాతి సంస్థల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. 1970లో కూడా అత్యున్నత స్థానంలో ఉన్నకంపెనీల ఆస్తులలో దాదాపు 37.7శాతం బహుళజాతిసంస్థల నియంత్రణలో ఉంది. పారిశ్రామిక లైసెన్సింగ్ విధాన విచారణ కమిటీ అంచనాల ప్రకారం 1966లో భారత దేశంలో 10కోట్ల రూపాయలు అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులతో దాదాపు 112 బహుళజాతి సంస్థలు పనిచేశాయి. ఈకంపెనీల్లో 48 కంపెనీలు విదేశీ శాఖల లేదా విదేశీ కంపెనీల భారతీయ అనుబంధ సంస్థలు 14 ఇతర కంపెనీలు భారీ రుణాలు, 54శాతంగా ఉంది. మిగిలినఇతర కంపెనీలు కూడా విదేశీ ఆధిపత్యంలోనేఉన్నాయి. 1960ల మధ్యకాలంలో పాశ్చాత్య విదేశీ మూలధనం దేశంలోని పెద్దవ్యాపారాలపై ఆధిపత్యం కలిగిఉంది. భారత దేశంలోని బహుళజాతి సంస్థల ముఖ్యమైన లక్షణం ఏమిటంటే,అవిభారత ఆర్థికవ్యవస్థ వనరుల్లోనే ఎక్కువ భాగాన్ని సేకరిస్తున్నాయి. సుదీప్తోదరి 1956 నుంచి1975 సంవత్సరం వరకు 50 అతిపెద్ద విదేశీ అనుబంధ సంస్థల నమూనాలను తీసుకుని బహుళ జాతి ఆర్థిక వనరులపై అధ్యయనం చేశాడు. ఈకంపెనీల మొత్తం ఆర్థిక వనరుల్లో 5.4 శాతం మాత్రమే విదేశీవనరుల ద్వారా అందించబడిందని మిగిలిన 94.6 శాతం భారతదేశవనరుల ద్వారా అందించబడిందని ఆయన అధ్యయనం వెల్లడించింది. బహుళజాతి కార్పొరేట్ సంస్థలు భారత దేశం నుంచి పెద్ద ఎత్తున లాభాలు తరలించుకుపోతున్నాయి. 2020-21లో 2లక్షల, 50 వేలకోట్ల రూపాయలుగా ఉన్న కార్పొరేట్ లాభాలు 2024-25 లో7లక్షల, వెయ్యికోట్ల రూపాయలకు చేరాయి. ఈ విషయాన్ని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. దేశంలో సంవత్సర కాలంలో కార్పొ రేట్ సంస్థల పన్నుల కంటే వాటి యజమానుల వ్యక్తిగత పన్నులు మించిపోయాయి. 2020-21నుంచి 2025 మధ్య కాలంలో బహుళజాతి సంస్థల లాభాలు మూడింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. దేశంలో ఆర్థిక అసమానతల ముఖచిత్రాన్ని కార్పొరేట్ల లాభాలు బహిరంగ పరుస్తున్నాయి. దేశం మొత్తం జనాభాలోని 10శాతం మంది వద్ద 77 శాతం సంపద పోగుబడి ఉంది. ఒక్సాఫామ్ నివేదిక ప్రకారం 2017లో దేశసంపదలో 73 శాతం సంపద1 శాతం సంపన్నులకు చేరింది. కటిక పేద వారైన 67 కోట్ల ప్రజల్లో సగం మంది ఆస్తిలో కేవలం 1శాతం పెరుగుదల మాత్రమే ఉంది. కార్పొరేట్ల సంపద పెరుగుదలతోపాటు ప్రభుత్వం కూడా పెద్దఎత్తున రాయితీలతోపాటు, రుణాలను రద్దు చేస్తున్నది. రిజర్వుబ్యాంక్ ఇండియా ఇచ్చిన డేటా ప్రకారం 2014- 2024 వరకు భారతీయ బ్యాంకులు మొండి బకాయిల పేరుతో 16,61,310 కోట్ల కార్పొరేట్ల రుణాలు రద్దుచేశాయి. ఇవికాక 2024-25 ఆర్థికసంవత్సరంలో 91,260 కోట్ల రూపాయల బకాయిలు రద్దుచేశాయి. స్వతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి దేశ పాలకులు సామ్రాజ్యవాద ప్రయోజనాలు కాపాడుతూ, బహుళ జాతి సంస్థల ప్రవేశానికి గేట్లు బార్ల తెరిచారు. ఫలితంగా బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం, వాటి దోపిడీ, సంపద తరలింపు దేశం నుంచి పెద్దఎత్తున కొనసాగుతున్నది. కేంద్రప్రభుత్వం కూడా వాటి ప్రయోజనాలకు అను గుణమైన విధానాలు అమలు జరుపుతున్నది. బహుళజాతి సంస్థల దోపిడీకి, దేశసంపద తరలింపుకి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలు ఉద్యమించాలి. ●



## కౌన్సిల్ భవనం పనులు సమీక్షించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణములోని శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అతి త్వరలోనే శాసన మండలి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మండలి సెక్రెటరీ డా.నరసింహా చార్యులు, ఆర్‌అండ్‌బి, అగాఖాన్ సంస్థ, తదితర అధికారులతో కలిసి జరుగుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ 'రాబోయే బడ్జెట్ సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలోనే నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. త్వరలోనే శాసన మండలి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారని, తాజాగా ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల గురించి ముఖ్యమంత్రి ఆరా తీశారని, ఖచ్చితంగా శాసన మండలి బడ్జెట్ సమావేశాలు అసెంబ్లీ ఆవరణలో ఉన్న భవనంలోనే నిర్వహించాలని ఆదేశించారని ఆయన వివరించారు. పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా, వేగం పెంచాలని, త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.ఆలస్యం చేస్తే కాంట్రాక్టు పనులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## రాష్ట్రానికి నిధులపై ప్రత్యేక కార్యాచరణ



### సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో సిఎస్ రామకృష్ణారావు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డా. బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్‌లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్‌లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమీషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్,జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్.శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించి, మరణాల సంఖ్యను తగ్గేంచేలా చర్యలు

### రోడ్డు భద్రతా ప్రతిజ్ఞావెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 03:** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాల సంఖ్యను తగ్గేంచేలా చర్యలు తీసుకోనున్నట్టు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందులో భాగంగా మంగళశారం సచివాలయంలో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞా వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో ప్రతి మోటార్ సైకిల్ ఉన్న వ్యక్తి వద్దకు ఈ ఆన్‌లైన్‌ప్రతిజ్ఞా సర్టిఫికెట్ చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వెబ్‌సైట్ ప్రారంభం తెలంగాణలో బాధ్యతా యుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందన్నారు. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని అన్నారు. సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి, రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చన్నారు. ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్‌ను ప్రారంభించిందిందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య,రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పెట్టెం పాల్గొన్నారు.

## ఉద్యోగాలపై త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి భారీ ప్రకటన

### తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: బల్మూరి వెంకట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై వెంకట్ మండిపడ్డారు.వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్‌వర్డ్ రిజిస్ట్రార్లు ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామని పేర్కొన్నారు.

ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు.

## సిఎం ప్రజావాణిలో 290 దరఖాస్తులు

**బేగంపేట ఫిబ్రవరి 3,ప్రభాతవార్త** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 290దరఖాస్తులు అందాయి.వాటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 90దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 29దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్లకోసం 132,ప్రవాసీ ప్రజావాణికి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 38దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణీ స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్,అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్,ఏసీపీ ఉమేందర్ దరఖాస్తులు స్వీకరించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ భారీ విజయం నమోదు చేయాలి

### పార్టీ శ్రేణులకు కెటిఆర్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల బరిలో భారత రాష్ట్ర సమితి ఘనవిజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగరవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్‌లు, మున్సిపల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని, ఇచ్చిన హామీల అమలులో విఫలమై మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బీజేపీలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఎన్నికల వ్యూహంలో భాగంగా సమన్వయం కీలకమని కేటీఆర్ స్పష్టం చేశారు.చాలా చోట్ల పార్టీ విజ్ఞప్తిని మన్నించి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికి అభ్యర్థులు స్వయంగా వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. వారికి తగిన గౌరవం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉందన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని సూచించారు. చివరి ఘట్టమైన ప్రచారంపై దృష్టి సారిస్తూ, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడం పైన కూడా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని సూచించారు.

## డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్యను ఖండిస్తున్నాం

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 03:** రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిజామాబాద్ జిల్లా మోపాల్ గ్రామానికి చెందిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యను డ్రగ్స్ మాఫియా అతి దారుణంగా కార్ యాక్సిడెంట్ చేసి హత్య చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను శిక్షించేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ముఖ్య జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో డ్రగ్స్ మాఫియా అరాచకాలు పెచ్చుమీరుతున్నాయని, రంగారెడ్డి జిల్లా పరిధిలో పోలీసులు జరిపిన దాడుల్లో డ్రగ్స్ నిరంతరం పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని, ప్రతి జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందని, ప్రభుత్వం వాటిని అరికట్టడంలో విఫలమవుతోందన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత పెడదారి పట్టి అరాచక శక్తులుగా మారుతున్నారని, దానివల్ల మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయని, వరుస హత్యలు జరుగుతున్నాయన్నారు.

రక్షణ కల్పించాల్సిన పోలీసులపైనే దాడులు జరుగుతుంటే, సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేవలం అరెస్టులకే పరిమితం కాకుండా, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా వేళ్లతో సహా పెకిలించాలన్నారు.



కామారెడ్డి ఆకాశవాణి రిలే కేంద్రంలో అగ్ని ప్రమాదం కారణంగా ఎగసిన మంటలు

## కామారెడ్డి ఆకాశవాణి రిలే కేంద్రంలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి పక్కన గల ఆకాశవాణి రిలే కేంద్రంలో మంగళవారం సాయంత్రం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ కేంద్రంలో గల ఎండు కట్టెల్లో సాయంత్రం నాలుగున్నర గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ వున్న సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేయగా వారు వెంటనే రంగంలో దిగి అరగంట వ్యవధిలోనే మంటలను ఆర్పివేశారు. అయితే ఆకాశవాణి రిలే కేంద్రంలో ఎండు కట్టెలు ఉన్నట్లుండి ఎందుకు మంటలకు ఆహుత య్యాయనేది ఎవరికి అర్థం కావడం లేదు. ఎవరైనా సిగరెట్లు తాగి వాటిపై పడవేశారా...? మరేదైనా కారణాల వల్ల మంటలు చెలరేగాయా...? అనే దానిపై అగ్నిమాపక శాఖ అధికారులు విచారిస్తున్నారు.

## హైదరాబాద్ భరోసా కేంద్రాన్ని సందర్శించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** జంట నగరాలలో లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు అండగా నిలుస్తున్న భరోసా కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సిపిసిఆర్) ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం డిసి పి లావణ్యా నాయక్ జాదవ్ వారికి స్వాగతం పలికారు. అనంతరం భరోసా కేంద్రం పనితీరును డిసిపి లావణ్యా జాదవ్ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సహా ఇతర ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు అపర్ణ, చందన, సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్ కుమార్‌లు భరోసా కేంద్రం పనితీరుపై సమీక్షించారు. భరోసా కేంద్రం ఉద్దేశాలను, లక్ష్యాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు బాధితులకు అందిన సహాయంపై వివరాలను తెలుసుకున్నారు. సమీక్ష తరువాత భరోసా కేంద్రం పనితీరును ఎసిపి సరిత కమిషన్ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డిసిపి లావణ్యా జాదవ్ మాట్లాడుతూ భరోసా కేంద్రం సాధించిన ఫలితాలను వివరించారు. బాధితులకు భరోసా కేంద్రం ఎలా ఆదుకుంటున్నదీ కూడా వివరించారు. బాధితుల కోసం ఏర్పాటైన ఛైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు గు రించి ఆమె కమిషన్ ప్రతినిధులకు వివరించారు. చిన్నారుల పట్ల అనుసరిస్తున్న సున్నితమైన విధానాలను డిసిపి వివరించారు. గత ఏడాది ఫోక్సో కేసుల్లో 38 మంది నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులు సఫలమయ్యారని డిసిపి తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యుత్తమని ఆమె చెప్పారు.



భరోసా కేంద్రాన్ని సందర్శించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతి నిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఎసిపి సరిత. వేదికపై కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రె డ్డి, డిసిపి లావణ్యా నాయక్ జాదవ్ తదితరులు

నేరగాళ్లకు శిక్షల శాతం ఎక్కువగా వుండడం భరోసా కేంద్రం, పోలీసుల సమిష్టి కృషి వల్లే సాధ్యమయ్యిందని డిసిపి తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధులు భరోసా కేంద్రాన్ని సందర్శించడం తమకు ఎంతో సంతోషంగా వుందని ఆమె అన్నారు. అనంతరం కమిషన్ ప్రతినిధులు భరోసా కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడి అధికారులు, ఇతర సిబ్బందితో భేటీ అయి, వారు సాధించిన ఫలితాలపై సంతోషం వ్యక్తం చేశారు. బాధితుల పట్ల భరోసా కేంద్రం చూపుతున్న ఔదార్యాన్ని వారు కొనియాడారు.

భరోసా కేంద్రానికి బాల ల హక్కుల పరిరక్షణ కమిషన్ పూర్తి మద్దతు వుంటుందని ఛైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఇతర సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం అధికారులతో పాటు భరోసా కేంద్రం అధికారులు కూడా పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

### పిడిఎస్‌యు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

**చిక్కడపల్లి ఫిబ్రవరి 3 ( ప్రభాతవార్త ) :** విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శిదీళీగే తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శిదీళీగే రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్ అధ్యక్షతన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ లు హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో నియంతృత్వం, ఫాసిజం ప్రమాదాలు పెరగడానికి ఆనాటి ప్రభుత్వాలు విద్యార్థి సంఘాలకు ఎన్నికలు రద్దు చేయడం ఒక ప్రధాన కారణం అన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు రాజకీయంగా,సామాజికంగా సాంస్కృతికంగా,చైతన్యం చెందుతారని దీని ద్వారా వారి హక్కులకు భంగం కలిగినప్పుడు చైతన్యవంతంగా పోరాడుతారన్నారు. విశ్వవిద్యాలయాల్లో పోలీసుల జోక్యం ఎక్కువైందని, విద్యార్థి ఉద్యమాలపై నిర్బంధం పెరగ దానికి విద్యార్థి సంఘాలకు ఎన్నికలు లేకపోవడమే కారణ మన్నారు. 2005లోనే లింగ్డో కమిటీ విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సిఫా రసు చేసిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహి స్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటుచేసిన విద్యా కమిషన్ కూడా సిఫారసు చేసినదని గుర్తు చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లు ఈ.ఉపేందర్, దుబ్బా రంజిత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళి, ఏ.ఐ.డి.ఎస్.ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, శిదీళీగే విజృంభణ రాష్ట్ర అధ్యక్షులు అల్లూరి విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భువనగిరి మధు,కే. శ్రీనివాస్, సందీప్, కూతాటి రాణా ప్రతాప్, మంద నవీన్, సహాయ కార్యదర్శులు జగజంపుల తిరుపతి, గుర్రం అజయ్, రాష్ట్ర కోశాధికారి ప్రణయ్, రాష్ట్ర నాయకులు గద్దం గౌతం, తీగల శ్యామ్, ఝాన్సీ,పుల్లూరి సింహాద్రి, రెడ్డి చరణ్, ఎం.గణేష్,శ్రీకాంత్ ఎస్.కే.ఆసిఫ్, భరత్, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

## సిపిఎస్‌ను రద్దు చేయాలి - 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకి పాత పెన్షన్ అమలు చేయాలి

### ఉపాధ్యాయులకి నగదు రహిత హెల్త్‌కార్డ్స్ మంజూరు చేయాలి - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టిజి-టి జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 03:** తెలంగాణలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి సీపీఎస్ మూలంగా నష్టపోతున్న లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ టీచర్ జేఏసి(టిజి- టి జేఏసీ) డిమాండ్ చేసింది. దాంతోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి టి జేఏసీ విజ్ఞప్తి చేసింది. టిజి-టి జేఏసీ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరరావు, సెక్రటరీ జనరల్ శానమోని నర్సింహులు మంగళవారం సచివాలయంలో సీఎస్‌కి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి దానివల్ల బాధపడుతున్న 2.40 లక్షల మందికి న్యాయం చేయాలని సీఎస్‌ని కోరారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకి నగదురహిత వైద్యం కోసం హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణులగుటకు ప్రత్యేకంగా అర్హత మార్కులను తగ్గించడం కానీ అదనంగా 10 మార్కులను కలిపి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భాషా పండితులను అప్‌గ్రేడ్ చేసినందుకు దన్యవాదాలు తెలుపుతూ.. 1-2005 చట్టాన్ని రద్దు చేసి నోషనల్ సర్వీస్ మంజూరు చేయాలని సీఎస్‌ని కోరారు. స్పందించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.. బడ్జెట్ సమావేశాల అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎస్ తెలిపారని జేఏసీ నేతలు చెప్పారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ, అధ్యాపకులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర అంశాలతోపాటు శాఖాపరమైన అనేక అంశాలను సీఎస్ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆర్థికేతర అంశాలను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తాననీ.. తరువాత మీరు కూడా వెళ్లి వారిని ఒకసారి కలవమని సీఎస్ సూచించారని జేఏసీ సెక్రటరీ జనరల్ నర్సింహులు తెలిపారు. బడ్జెట్ సమావేశాల అనంతరం ఆర్థిక అంశాల గురించి టిజి టి జేఏసీ నేతలను పిలిపించుకొని పూర్తిస్థాయిలో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఛైర్మన్లు భూతం యాకమల్లు, ఎండి.సాబేర్, మల్లెపాక వెంకన్న, బాణాల రత్నాకర్ రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ గోళ్ల ఉదయ్ భాస్కర్, లక్ష్మణ్, దామోదర్, కృష్ణయ్య, కృష్ణప్రియతో పాటు భాగస్వామ్య 30 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిట్ విచారణను ప్రభావితం చేసేలా రేవంత్ మాటలు : సిరికొండ మధుసూదనా చారి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** కెసిఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. రేవంత్ మాటలు సిట్ విచారణను ప్రభావితం చేసేలా ఉన్నాయి. కేసీఆర్ ఏనాడు కూడా విచారణ ను ఎదుర్కోను అని అనలేదు ..మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున మొదటి నోటీసు విచారణకు టైమ్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నో విచారణలను రెండేళ్లలో ఎదుర్కొన్నాం. దేనికి భయపడమన్నారు.కేసీఆర్ ముమ్మాటికీ జాతిపితే.. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన చరిత్ర కేసీఆర్‌దన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా ఉంటారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డిది చీమ కాలంత ప్రమేయం కూడా లేదు. నిన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి విద్వేష పూరిత ప్రసంగాలు వద్దని సూచించినా దాన్ని పెడచెవిన పెట్టి రేవంత్ కేసీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని సిరికొండ మధుసూదనా చారి అన్నారు. హార్వర్డ్ వెళ్లినా అంతరిక్షం వెళ్లినా రేవంత్ బుద్ధి మారదు. గ్యారంటీల అమలు వదిలి గారడీ ప్రభుత్వాన్ని నడుపుతున్నాడు.. కేసీఆర్ పదవులకు రాజీనామా చేసి సొంతగా పార్టీ పెట్టి తెలంగాణ సాధించారు.. రేవంత్ తన చిల్లర బుద్ధిని చాటుకుంటూ కేసీఆర్‌పై అదే పనిగా పిచ్చి విమర్శలు చేస్తున్నారు. రేవంత్ విమర్శలను తెలంగాణ సమాజం గమనిస్తోంది. తగిన బుద్ధిచెబుతుందన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని.. జాతర నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని సీఎం, మంత్రులు ఉత్తర కుమార ప్రగాల్భాలు పలికారు. 15 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది.

కనీస ఏర్పాట్లు చేయలేకపోయారన్నారు. ఇదొక్క వైఫల్యం చాలు రేవంత్ ప్రభుత్వం ఎట్లా పనిచేస్తోందో చెప్పడానికి.

కేసీఆర్ హయాంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. మాటలు తప్ప ఈ ప్రభుత్వంలో చేతలు లేవు.

సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన భక్తులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని మధుసూదనా చారి డిమాండ్ చేశారు.

# గిరిజన రైతులకు జల వికాసం

## న- నాబార్డు నుండి రూ.600 కోట్ల రుణం - 2.1 లక్షల మందికి, 6 లక్షల ఎకరాలకు సాగు నీరు - 2025-26 బడ్జెట్‌లో మరో రూ.600 కోట్లు కేటాయింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త** రాష్ట్రంలోని గిరిజన రైతులకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయం నిమిత్తం గిరిజన భూములకు సాగునీరు అందించే ఉద్దేశంతో చేపట్టిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలు ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) సంస్థ నుంచి రూ. 600 కోట్ల రుణాలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నాబార్డ్ సంస్థతో చర్చలు కూడా జరుపుతున్నారు. అయితే ఈ సంస్థ నుంచి ప్రభుత్వానికి రుణాలు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. మార్చి నెలలోపు నిధులను మంజూరు చేసే అవకాశాలు కూడా ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించింది. వీటితో పాటు అనుకున్నట్టు నాబార్డు సంస్థ నుంచి కూడా ప్రభుత్వానికి నిధులు మంజూరు అయితే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇక నిధులు అందిన వెంటనే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న అర్హులైన రైతుల నుంచి ధరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను ప్రారంభించనుంది. అయితే ఈ స్కీమ్ కింద అటవీ హక్కుల పత్రాలు కలిగిన సుమారు 2.1 లక్షల మంది గిరిజన రైతుల ఆధీనంలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఒక్కో రైతుకు రూ. 6 లక్షల విలువైన సోలార్ పంపు సెట్లు, ప్యానెళ్లను 100 శాతం సబ్సిడీతో అందించనుంది. ఈ సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోనున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం వినియోగించుకోగా, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌ను అమ్మేందుకు అవకాశం కల్పిస్తుంది ప్రభుత్వం. ఈ మిగులు గ్రిడ్ ద్వారా ప్రతి రైతు నెలకు సుమారు రూ.3 నుంచి 5వేల వరకు ఆదాయం పొందవచ్చని అంచనా వేస్తోంది.



అవార్డులను ప్రదానం చేస్తున్న శ్రీనివాసరావు, ప్రభాకర్, కిరణ్, శ్రీకాంత్ తదితర అతిధులు

## విద్యార్థుల్లోని ప్రతిభకు పట్టంకట్టి ప్రోత్సహించడం హర్షదాయకం : ఏపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి పట్టంకట్టి జీనియస్ అవార్డులతో సుచిరిండియా ఫౌండేషన్ ప్రోత్సహించడం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడు ఘంటా శ్రీనివాసరావు సంస్థను, ఛైర్మన్ లయన్ కిరణ్‌లను అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, విద్య, ఆరోగ్యం పట్ల కార్యోన్ముఖులను చేయడం శ్లాఘనీయమని అన్నారు. ప్రముఖ సామాజిక సేవాసంస్థ సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో ఏపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఘంటా శ్రీనివాసరావు విశిష్ట అతిథులు సినీనటుడు శ్రీకాంత్, శివాజీరాజా, లయన్ కిరణ్ తది తరులతో కలిసి జ్యోతిప్రకాశనంచేసి ముందుగా సూచిరిండియా ఫౌండేషన్ కాఫీటేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ సుచిరిండియా ఫౌండేషన్ 33వ సర్ సివిరామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షను జాతీయ, రాష్ట్రస్థాయిల్లో వివిధ పాఠశాలల్లో నిర్వహించగా 500పైగా పాఠశాలల నుండి లక్షమంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన 33వ జాతీయస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో ఎంపికైన 20మందికి గోల్డ్‌మెడల్స్, 20మందికి నేషనల్ ర్యాంక్స్, 20మందికి రాష్ట్రస్థాయి మెడల్స్, 450మందికి జిల్లాస్థాయి ర్యాంకులు పొందిన యువ ప్రతిభావంతులైన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా సర్ సివిరామన్ యంగ్ జీనియస్ అవార్డులు 2026 ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ యువప్రతిభ వెనుకవున్న ఉపాధ్యాయులను ఛత్రాలయా పురస్కారాలు, గురుబ్రహ్మ పురస్కారాలతో ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుధీర్‌సంద్ర ప్రత్యేక సెషన్ నిర్వహించి ఆకట్టుకున్నారు.

## రైతుల వినూత్న వ్యవసాయానికి ప్రోత్సాహం వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త** రాష్ట్రంలోని రైతాంగం వినూత్న వ్యవసాయ విధానాలను అనుసరించేలా ప్రోత్సహించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. హైదరాబాద్‌లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలన్నారు. ఇలా నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు



## త్రిసభ్య కమిటీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

### తన వద్ద ఉన్న ఆధారాలు కమిటీకి అందజేత

**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కోడూరు పట్టణంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగి తనను లైంగిక వేధింపులకు గురి చేశాడని ప్రచార మాధ్యమాలలో తెలియజేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారం రోజుల క్రితం త్రిసభ్య కమిటీని వేసి విచారించవలసిందిగా ఆదేశించారు. త్రి కమిటీ సభ్యులు సభ్యులు విజయవాడ ఇంద్రకీలాద్రి దేవస్థానం బోర్డు సభ్యులు తంబళ్లపల్లి రమాదేవి, అనంతపురం జిల్లా కార్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ టి సి వరుణ్, ఎంఎస్ఎంఈ ఛైర్మన్ శివశంకర్ మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని రాజు కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌నుపిలిపించి విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమం మొదట 11 గంటల సమ యంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతున్న సందర్భంలో ఒంటిగంట మధ్యలో ఉన్నట్లుండి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అతివేగంగా త్రిసభ్య కమిటీ ముందుకు చేరు కుని తన వద్దఉన్న వివరాలను కమిటీకి అందజేశారు. అదేవిధంగా ఆ పార్టీకి చెం దిన 45 మంది కార్యకర్తలను విడివిడిగా ప్రశ్నిం చారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన కమిటీ సమావేశం సాయంత్రం 6గంటలకు ముగిసింది. అనంతరం విచారణ కమిటీ సభ్యు లు వరుణ్, శివశంకర్, రమాదేవిలు విలేకరుల తో మాట్లాడుతూ విచారణ వివరాలను రాష్ట్ర జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

### తన వద్ద వున్న ఆధారాలను కమిటీకి అందజేశా: ఎమ్మెల్యే:

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ విచారణ కమిటీ ముందు తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన తాను చెప్పిన వివరాలతో పాటు తన వద్ద ఉన్న ఆధారాలను త్రిసభ్య కమిటీకి అందజేసినట్లు అరవ శ్రీధర్ విలేకరులకు తెలియజేశారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తల్లీ బిడ్డల ఆత్మహత్యలపై భర్త వాంగ్మూలం

### తమ కుటుంబంలో ఎలాంటి విబేధాలు లేవని వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘట్‌కేసర్ మార్గంలో గత నెల 30వ తేదీన అర్ధరాత్రి 12,40 గంటల సమయంలో బోడుప్పల్‌కు చెందిన విజయశాంతి రెడ్డి (38) ఆమె కుమార్తె చేతనా రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (16)లు గూడ్సు రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకోవడంపై విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి మంగళవారం పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయ న రెండు రోజుల క్రితం భారత్‌కు వచ్చారు. తన భార్య, పిల్లల అంత్యక్రియలను ఆదివారం నాడు నిర్వహించాక మంగళవారం నాడు రైల్వే పోలీసుల ఎదుట హాజరై వాంగ్మూలం ఇస్తూ తమ కుటుంబంలో ఎలాంటి గొడవలు లేవని ఆయన తెలిపారు. తన భార్య విజయశాంతి రెడ్డి చాలా ధైర్య వంతురాలని, ఇద్దరు పిల్లలంటే ఆమెకు ప్రాణమని ఆయన తెలిపారు. తమకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేదని, కుటుంబంలో కూడా ఎలాంటి కష్టాలు లేవని ఆయన తెలిపారు. తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని సురేం దర్ రెడ్డి ఆవేదనగా తెలిపారు. దీనిపై పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన తెలిపారు. మరోవైపు చర్లపల్లి స్టేషన్ సమీపంలో తల్లీ ఇద్దరు టీనేజి పిల్లల ఆత్మహత్యలపై రైల్వే పోలీసుల విచారణ కొనసాగుతోంది. తాను ఒంటిరిదానిని అయ్యానని విజయశాంతి రెడ్డి రాసిన సూసైడ్ లెటర్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ విషయం ఆమె ఎందుకు రాసిందని, ఇంట్లో అన్ని వుండి కూడా ఎందుకు ఒంటరిగా మారిందనే బావన ఆమెకు కలిగిందని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమె పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏమైనా వేధింపులు వున్నాయా...? సహచరుల నుంచి ఇబ్బందులు ఏమైనా ఎదురయ్యాయా....? ఇంట్లో ఏమైనా ఇక్కట్లు వున్నాయా...? లేదా పిల్లలకు ఏమై నా సమస్యలు వచ్చాయా...? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. ఇక వీరి ఆత్మహత్యలను నివారించడంలో చర్లపల్లి స్టేషన్‌లో వున్న భద్రతా సిబ్బంది తీరు గురించి విమర్శలు రావడంతో దీనిపైనా రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి అర్ధరాత్రి 12 గంటల సమయంలో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చినట్లు సిసి కెమెరాల్లో వుంది. దీని తరువాత కారు తాళాలను కుమారుడు విశాల్ రెడ్డి జేబులో వుంచింది. అనంతరం ఇద్దరు పిల్లలతో స్టేషన్‌లో అటు ఇటూ అరగంట పాటు తిరిగింది. అర్ధరాత్రి వేళ ఒక మహిళ ఇద్దరు పిల్లలతో రైళ్ల రాకపోకలు లేని సమయంలో స్టేషన్‌లో ఎందుకు తచ్చాడుతుందనే దానిపై భద్రత సిబ్బంది ఎందుకు గమనించలేదనే అంశంపైనా రైల్వే పోలీసులు విచారి స్తున్నారు.

దీని తరువాత ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి చీకట్లో ఘట్‌కేసర్ మార్గంలో రైలు పట్టాలపై వెళుతున్నపుడు కూడా ఎవరూ గమనించక పోవడం కూడా భద్రతా సిబ్బంది వైఫల్యంగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు.

విజయశాంతి రెడ్డి సెల్‌ఫోన్‌తో పాటు ఇతర వస్తువులను జప్తు చేసిన పోలీసులు దీనిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు.

## ఫైనల్స్‌కు దూసుకువెళ్లిన ఢిల్లీ క్యాపిటల్స్

### ఏడు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసిన గుజరాత్ జైంట్స్




**వదోదర, ఫిబ్రవరి 3:** మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్‌షిప్‌కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ కేపిటల్స్ నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎలిమినేటర్‌మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను కట్టడిచేస్తూ టైటిల్ పోరుకు సిద్ధమైంది. 169 పరుగుల ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) అదిరే బోణీచేస్తే జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయింది. ఫిబ్రవరి 5న ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది. ఏడు వికెట్ల తేడాతో గుజరాత్ మహిళాజట్టుపై గెలుపుసాధించి ఫైనల్‌కు దూసుకుపోయింది. లీగ్ దశలో గుజరాత్ జెయింట్స్ చేతిలో రెండుసార్లు ఓటమి చవిచూసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఎలిమినేటర్‌లో గర్జించింది. తొలిసారి ఫైనల్ ఆడాలనుకున్న గుజరాత్ ఆశల్ని ఆడియాసలు చేసింది. బౌలర్ల కృషిని వృథా చేయకుండా బ్యాటర్లు దంచేయగా భారీ లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఉఫ్‌మనిపించింది ఢిల్లీ. టాప్ క్లాస్ ఆటతో గుజరాత్‌కు చెక్ పెట్టిన ఢిల్లీ నాలుగోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. భారీ ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికించారు. పవర్ ప్లేలోనే 75 పరుగులు చేసింది ఢిల్లీ. ఈ ద్వయాన్ని ఎట్టకేలకు వరేహం విడదీసింది. డేంజరస్ లిజెల్లీ ఎల్బీగా ఔట్ కావడంతో గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. అదే ఓవర్లో కట్ షాట్ ఆడబోయిన షఫాలీ క్లీన్‌బౌల్డ్ అయింది. లారా వొల్వార్డ్(32 నాటౌట్) జతగా జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. మరిజానే కాప్ 4 నాటౌట్‌గానిలిచి లాంఛనం పూర్తి చేసింది. వరేహం వేసిన 16వ ఓవర్లో తను బౌండరీ కొట్టడంతో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ జయభేరి మోగించి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. గుజరాత్ జెయింట్స్ ఆరంభంలో తడబడినా ఆఖర్లో భారీ స్కోర్ చేసింది. పవర్ ప్లేలో చిన్నెల్లీ హెన్రీ(3-35), నందిని శర్మ (2-44)ల విజృంభణతో కీలక వికెట్లు కోల్పోయిన గుజరాత్‌ను బేత్ మూనీ(62 నాటౌట్) ఆదుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా ధైర్యంతోఆడిన మూనీజార్జియా వరేహం(35) తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించింది. ఆఖర్లో కష్వీ గౌతమ్(18), మూనీలు బౌండరీలతో చెలరేగగా నిర్ణీత ఓవర్లలో 168 పరుగులతో ఢిల్లీకి సవాల్ విసిరింది గుజరాత్.

## మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి కన్నుమూత

### ఏఐఎంఐఎం పార్టీలో విషాదం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన పాషా ఖాద్రి



**చార్మినార్,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** అనారోగ్యంతో గత కొంత కాలం నుంచి బాధపడుతున్న ఎఐఎంఐఎం ప్రధాన కార్యదర్శి,మాజీ శాసన సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి (72) మంగళవారం రాత్రి పాతబస్తీ బహదూరపురలోని తన నివాసంలో మృతి చెందారు. నాలుగు సార్లు శాసన సభ్యులుగా,కార్పొరేటర్‌గా ఒక సారి గెలిచిన సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి మృతితో ఏఐఎంఐఎం పార్టీలో విషాదం చోటు చేసుకుంది.గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న పాషా ఖాద్రి కంచన్‌బాగ్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం మెరుగుపడటంతో బహదూర్‌పురలోని తన నివాసంలో ఉండి వైద్య సేవలు పొందుతున్నారు.మం గళవారం రాత్రి హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురలోని తన నివాసంలో సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి మృతి చెందారు.హైదరాబాద్ పాతబస్తీలోని డబీర్‌పుల్లో 1954 సెప్టెంబరు 15వ తేదీన సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి జన్మించారు.దివంగత సుల్తాన్ సలా వుద్దీన్ ఓవైసీకి సన్నిహితులైన అహ్మద్ పాషాఖాద్రి 1986లో జరిగిన జీహెచ్ఎంసి ఎన్నికల్లో డబీర్‌పుర డివిజన్ నుంచి కార్పోరేటర్‌గా గెలుపొందారు.ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి 2004,2009,2014 అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి మూడు సార్లు పోటీ చేసి ఎంఐఎం పార్టీ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.కాగా 2018 అసె ంబ్లీ ఎన్నికల్లో యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాలుగవ సారి శాసన సభ్యులుగా విజయం సాధించారు.మూడు సార్లు చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పాషా ఖాద్రి చార్మినార్ నియోజకవర్గం అభివృద్ది కోసం ఎంతగానో కృషి చేశారు.

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదు

**రైల్వేకోడూరు,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని, కేసు నమోదు చేయా లని ఒక మహిళా ఉద్యోగి జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడుకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఎన్‌హెచ్ఆర్‌సి ఆదేశాలతో ఎట్టకేలకు మంగళవారం రైల్వేకోడూరు టౌన్ సిఐ చం ద్రశేఖర్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై బిఎంఎస్ 318(2), 318(4), 351 (2) సెక్షన్ల కింద కేసు చేశారు. ఈ మేరకు సిఐ విలేకరులతో మా ట్లాడుతూ ఎస్పి ఆదేశాల మేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రాష్ట్రంలో పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

### పది నెలల్లో రూ.11 వేల కోట్లు రాక

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు సత్ ఫలితానిస్తున్నాయి. ప్రధానంగా రియల్‌ఎస్టేట్‌లో తీసుకొచ్చిన పాలసీతో ప్రభుత్వ ఖజానాకు అధిక మొత్తంలో రెవెన్యూ సమకూరుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయంలో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం పది నెలల వ్యవధిలో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెరిగి మొత్తంగా రూ.10951.30 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరింది. అదే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వచ్చిన ఆదాయం రూ.10,354.85 కోట్లు. గతంతో పోలిస్తే ఈ ఏడాది రూ.596.45 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది. ఆదాయ వృద్ధిలో జనవరి నెల కీలకంగా మారింది. ఈ ఏడాది జనవరి నెలలోనే ఏకంగా రూ.1046.29 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది అదే నెలలో వచ్చిన ఆదాయం రూ.861.86 కోట్లుగా ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెరగడంలో వ్యసాయేతర భూముల లావాదేవీలు కీలక పాత్ర పోషించాయి. రియల్ ఎస్టేట్ లావాదేవీలు పుంజుకోవడం, పట్టణ ప్రాంతాల్లో క్రయ విక్రయాలు పెరగడం, డిజిటల్ సేవల విస్తరణ వంటి అంశాలు రిజిస్ట్రేషన్ శాఖకు కలిసొచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాది ఇదే సమయానికి 14,41,466 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరగ్గా, ఈ ఏడాది 14,05,723 దరస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి.

## బడ్జెట్‌లో తగ్గిన వ్యవసాయ కేటాయింపులు : రైతు స్వరాజ్యవేదిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త** వ్యవసాయ కేటాయంపుల్లో కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందని రైతు స్వరాజ్య వేదిక విమర్శించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు 3.04 శాతానికి పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు గతేడాదికి ఇప్పటికి రూ.9 వేల కోట్ల బడ్జెట్ తగ్గటం ఆందోళకరమన్నారు. ఈ మేరకు ఒక ప్రకటనలోప్రతియేటా కేటాయించిన నిధులను కూడా పూర్తిగా ఖర్చు చేయడం లేదన్నారు. ప్రస్తుత 2025-26 వార్షిక అంచనా బడ్జెట్లో రూ.1.72 లక్షల కోట్లు కేటాయిస్తే రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్, కూరగాయలు, పండ్ల మిషన్‌కు కేటాయింపులు నిరుడు రూ.500 నుంచి రూ.1,000 కోట్లు కేటాయించగా, ఈ కొత్త బడ్జెట్లో వాటిని అసలు నిధులు కేటాయించకుడా సున్నాకు తగ్గించినట్లు పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ (బిందు సేద్యం) పథకాలకు కూడా నిధులు 13.6 శాతం తగ్గిందన్నారు.

అలాగే వ్యవసాయ కార్మికుల ప్రస్తావన బడ్జెట్‌లో లేదన్నారు. పంటల బీమా నిధులు గత ఏడాదితో పోలిస్తే 15.7 శాతం తగ్గించి రూ.12,200 కోట్లకు పరిమితం చేసినట్లు పేర్కొన్నారు.

## లిఫ్ట్ ఇచ్చిన డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన గుర్తు తెలియని వ్యక్తి

### చిట్యాల నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై ఘటన - చికిత్స పొందుతున్న డ్రైవర్

**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త :** కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌ను గుర్తుతెలియని వ్యక్తి లిఫ్ట్ అడిగి అదే డ్రైవర్‌పై కత్తితో దాడికి పాల్పడిన ఘటన నల్గొండ జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65పై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్ అలీ హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి తన క్యాబ్ యజమానిని నల్గొండలో వదిలి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో నార్కట్‌పల్లి శివారులోని ఓ హోటల్ వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి అర్ధరాత్రి సమయంలో లిఫ్ట్ అడగడంతో ఇమ్రాన్ అలీ అతడిని కారులో ఎక్కించుకున్నాడు. కారులో ఎక్కించుకున్న పది నిమిషాల్లోనే చిట్యాల వద్దకు చేరుకోగానే పక్కనే కూర్చున్న ఆవ్యక్తి తనతో పాటుగా వెంట తెచ్చుకున్న కత్తితో డ్రైవర్ ఇమ్రాన్ అలీపై ఒక్కసారిగా దాడి చేసి, అతడి వద్ద ఉన్న చరవాణిని లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఇమ్రాన్ అలీ అప్పటికే తనకు తాను కాపాడుకుంటూ కారు ఆపి గట్టిగా అరవడంతో ఆవ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. అటు వైపు నుంచి వెళ్తున్న స్థానికులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించి, అపస్మారక స్థితిలో పడి ఉన్న డ్రైవర్ ఇమ్రాన్ అలీని అంబులెన్సులో చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈదాడిలో కడుపు భాగంలో రెండు చోట్ల కత్తిపోట్లు తగిలి ఇమ్రాన్ తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నిందితుడు బీహార్,

ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా అనుమానం ఉన్నట్లు బాధితుడు ఇమ్రాన్ అలీ పోలీసులకు తెలిపారు. ఇమ్రాన్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు.

## గద్దర్ అవార్డుల అప్లై గడువు పొడిగింపు

### 5వ తేదీ సాయంత్రం 4 వరకూ అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమాన్ని ఈసారి మరింత ముందుగానే నిర్వహించేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తులు చేసుకునేందుకు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ఈ గడువు ముగియడంతో మరో సారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల (2025) దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మరోపక్క గత ఏడాది ప్రారంభమైన ఈ అవార్డుల నిర్వహణపై ప్రభుత్వం జనవరిలోనే కసరత్తు మొదలుపెట్టింది. గద్దర్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం, ఈసారి ప్రముఖ కవి సి. నారాయణరెడ్డి పేరుతో కూడా ప్రత్యేక అవార్డును అందించనుంది. ఈ నేపథ్యంలో గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించిన అప్లికేషన్లు జనవరి 31 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు, ఫిబ్రవరి 3లోగా వాటిని సబ్మిట్ చేయాలని తొలుత ప్రకటించింది. అయితే వరుసగా బ్యాంక్ సెలవులు రావడంతో గడువును ఫిబ్రవరి 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు అప్లికేషన్లు అందజేయనున్నట్లు తెలిపింది. అలాగే అదే రోజు సాయంత్రం 4 గంటలలోగా అప్లికేషన్లను తప్పనిసరిగా సబ్మిట్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ అవకాశాన్ని సినిమా రంగానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూచించింది.

## కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన బాన్సువాడ కౌన్సిలర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం, బాన్సువాడ పట్టణానికి చెందిన ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కెటిఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్లో చేరిన కౌన్సిలర్లు, బాడి శ్రీనివాస్, లాయక్, అక్బర్, ఖాదర్, గంగారామ్, రైటర్ రాజు కెటిఆర్ సమక్షంలో చేరారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఎలమంచిలి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇప్పటికే నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థులు తమ బీఫామ్స్ సమర్పించి ప్రచారంలో దూసుకుపోతుండగా, తాజా చేరికలతో కాంగ్రెస్ పార్టీ కోట కుప్పకూలినట్లయింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి, బాన్సువాడ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ చేరికలతో బాన్సువాడలో కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని, బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని స్థానిక నేతలు ధీమా వ్యక్తం చేశారు.

# పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

● ఎపిలో యేటా సగటున 8 వేల మంది మృతి ● మృతుల్లో అత్యధికులు ద్విచక్రవాహనదారులే



విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సగటున 8 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఏపీ క్రైమ్ పోలీసు విభాగం తెలిపిన సమాచారం మేరకు రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక ద్విచక్రవాహనదారులే ఉంటున్నారు. తలకు బలమైన గాయాలవ్వడం వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. 2025లో విజయవాడ కమిషనరేట్ పరిధిలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 366 మంది మృతి చెందగా అందులో 209 మంది ద్విచక్ర వాహన ప్రయాణికులే. వీరిలో ఎక్కువ మంది ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. ప్రాణనష్టం అధికంగా ఉండటానికి ఇదే కారణమైంది. బైక్ నడిపేవాళ్లు, వెనక కూర్చొన్న వాళ్లు హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగినా, ప్రాణాలు నిలబడతాయని తెలిసినా ఇంకా చాలా మంది నిరక్ష్యంగానే ఉంటున్నట్లు, ఏమవుతుందిలే అన్న ధీమా వారి ప్రాణాలను బలిగొంటోంది. హెల్మెట్ ధరించకపోవటం వల్ల రాష్ట్రంలో ఏటా సగటున 2,5003,000 ప్రాణాలు రోడ్డుపాలవుతున్నాయి. అతి వేగం కారణంగానే ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. మితిమీరిన వేగంతో బండి నడిపేటప్పుడు ఆకస్మికంగా వాహనాన్ని అదుపు చేయడం కష్టమవుతోంది. దీంతో తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బైక్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్‌లో మాట్లాడటం, మద్యం మత్తులో వాహనం నడపటం, నిబంధనలు సరిగ్గా పాటించకపోవడం కూడా ప్రమాదాలను సంఖ్యను పెంచుతున్నాయి. ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు ఎక్కువ యాక్సిడెంట్లు చోటు చేసుకుంటున్నాయి. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించాలంటే ఎంత వేగంతో వెళ్లాలనేది కచ్చితంగా అంచనా వేయలేకపోవటం, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయటం వంటివి ఘటనల సంఖ్యను పెంచుతున్నాయి.

రాష్ట్రంలో 2020 నుంచి 2025 నవంబరు వరకూ 1,20,657 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 59,724 (49.49 శాతం) ద్విచక్ర వాహన ప్రమాదాలే. ఆరేళ్ల గణాంకాలు విశ్లేషిస్తే సగటున ప్రతి గంటకూ రెండు నుంచి, మూడు ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలింది. వాటిలో ఒకటి ద్విచక్ర వాహన ప్రమాదం. 2025లో నవంబరు 30 వరకూ రాష్ట్రంలో 18,837 ప్రమాదాలు జరగ్గా 8,466 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో దాదాపు 45 శాతానికి పైగా ప్రమాదాలు, ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనాలతో చోటు చేసుకున్నవే. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు కనీసం ఒక్క మరణమైనా చోటు చేసుకునే ముప్పు అధికంగా ఉంటోంది. 2020 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో 16,141 మంది మృతి చెందారు. అందులో 11,139 మంది (69.01 శాతం) ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. తలకు బలమైన గాయాలవడం వల్లే వారు ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు తలకు గాయాలవ్వటం వల్లే సంభవిస్తున్నాయనేది పోలీసులు, రవాణా శాఖాధికారుల మాట. తలపై ఓ మోస్తరు దెబ్బ తగిలినా లోపలి భాగంలో రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఇది ప్రాణాంతకమవుతోంది. ప్రాణాలతో బయటపడ్డా కొన్ని సందర్భాల్లో నెలల తరబడి కోమాలోనే ఉండాల్సి వస్తోంది. ప్రమాదకరంగా ఓవర్ టేకింగ్ చేయటం, నిరక్ష్యంగా డ్రైవింగ్ వాహన నిర్వహణ సరిగ్గా లేకపోవడం ఎక్కువ దూరం బైక్‌పై ప్రయాణించటం వల్ల అలసిపోవటం, మంచు కమ్మేసిన సందర్భాల్లో ముందున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవటం, రాత్రి వేళల్లో రహదారులు సరిగ్గా కనిపించకపోవటం, జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనం నడిపేటప్పుడు లేన్ డిసిప్లేన్ పాటించకపోవటం వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం, నైపుణ్యం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపటం వంటి రోడ్డు ప్రమాదాలకు 9 ప్రధాన కారణాలుగా పోలీసులు తెలుపుతున్నారు.



జయహో పుస్తకంను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.

## బుక్ రీడింగ్‌తో మొబైల్ కల్చర్ తగ్గింపు

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యాసంస్థలన్నింటిలోనూ ఒక సెషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు బుక్ రీడింగ్ అలవాటు చేసేలా ఉపాధ్యాయులందర్నీ మోటివేట్ చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టిన హైదరాబాద్ నుండి అమరా వతికి పుస్తకంతో బస్సు యాత్ర విజయవాడ మజిలీలో భాగంగా మంగళవారం ఉదయం విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ఆ బస్సు యాత్రకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. బస్సు యాత్ర చేస్తున్న పుస్తక ప్రేమికుల్ని, రచయితల్ని, ఉద్యమకారుల్ని ఆత్మీయంగా పలకరించారు. బస్సు యాత్ర విశేషాలను ఉద్యమ సారధి మంచికంటిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పెరిగిపోయిన మొబైల్ కల్చర్‌ను తగ్గించాలంటే బుక్ రీడింగ్ ఒక్కటే మార్గమన్నారు. మొబైల్ నిర్మాణ టెక్నాలజీ కూడా పుస్తకం చదవడం ద్వారానే వచ్చిందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు బాగా పెంచాల న్నారు. వాళ్ళను గ్రంథాలయాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం వుందన్నారు. ఆ దిశగా ఉద్యమిస్తున్న మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులం దర్నీ అభినందించారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోనూ విద్యాల యాల్లో వారానికి ఒక్కరోజు పాఠ్యాంశేతర పుస్తకాలను చదివే విధంగా ఒక సెషన్ ఏర్పాటు చేసేలా ఉపాధ్యాయుల్ని మోటివేట్ చేస్తామన్నారు. అవకాశ మున్న పార్కుల్లో మినీ మొబైల్ గ్రంథాలయాల ఏర్పాటు గురించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా "జయహో పుస్తకం' పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, మంచికంటి, బండారు విజయ, కాసుల రవికుమార్, సిప ప్రసాద్, కాంతి నల్లూరి, పైడిమర్రి విజయ, కందుకూరు రాము, కస్తూరి ప్రభాకర్,


## వైసిపిదంతా హింసాత్మక రాజకీయం



విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలను ప్రోత్సహించారే తప్ప ఏనాడైనా తప్పని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మంత్రి అనిత హెచ్చరించారు.

## రాష్ట్రాల అవసరాల మేరకు యూరియా సరఫరా

● యూరియా కొరత, ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు ● వైసిపి ఎంపి రఘునాథ్ రెడ్డికి కేంద్రమంత్రి స్పష్టం



రాజంపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్రాలలో ఖరీఫ్, రబీ సీజన్లలో అవసరాలను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించే నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తుందని కేంద్రమంత్రి స్మాత్ అనుప్రియ పటేల్ స్పష్టం చేశారు. గత ఆరు నెలలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమైన ఎరువులు సరఫరా చేయడం జరిగిందని తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన యూరియా కొరత, ఎరువుల సరఫరాపై వైసిపి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాధ రెడ్డి పార్లమెంట్ సమావేశాల్లో మంగళవారం ప్రస్తావించారు. యూరియా సమస్యపై రాష్ట్రం నుంచి ఐదు ఫిర్యాదులు అందినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రాల అంతటా యూరియా లభ్యత తగినంతగా ఉందన్నారు. ఎరువులను నిత్యావసర వస్తువుల చట్టం, 1955 ప్రకారం ముఖ్యమైన వస్తువుగా ప్రకటించారని, ఎరువుల నియంత్రణ ఉత్తర్వు, 1985 కింద నోటిఫై చేశారని పేర్కొన్నారు. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం బ్లాక్ మార్కెటింగ్, అధిక ధర నిర్ణయించడంలో పాల్గొన్న వ్యక్తులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని స్పష్టం చేశారు. అయితే గత ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎరువుల లభ్యత, బ్లాక్ మార్కె టింగ్, అధిక ధరలకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారానికి ఆన్‌లైన్ ద్వారా 5 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా స్థాయిలో రాష్ట్రంలో ఎరువుల పంపిణీ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జరుగుతుంది కాబట్టి, అవసరమైన చర్య కోసం ఈ ఫిర్యాదులను రాష్ట్ర ప్రభుత్వా నికి పంపామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా దేశంలో ఎరువులు సకాలంలో తగినంత లభ్యతను నిర్ధారించడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి, రాష్ట్రాల వారీగా, నెలవారీగా ఎరువుల అవసరాన్ని అంచనా వేస్తుందని వివరించారు. క్షేత్ర స్థాయిలో అంచనా వేసిన అవసరాల ఆధారంగా, డిఓఎఫ్ నెలవారీ సరఫరా ప్రణాళికను జారీ చేయడం ద్వారా రాష్ట్రాలకు తగినంత పరిమాణంలో ఎరువులను కేటాయిస్తుందని, దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన సబ్సిడీ ఎరువుల కదలికను ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే ఆన్‌లైన్ వెబ్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ పర్యవేక్షిస్తుందని చెప్పారు.



అవార్డులను ప్రదానం చేస్తున్న శ్రీనివాసరావు, ప్రభాకర్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు

## విద్యార్థుల్లోని ప్రతిభకు పట్టంకట్టి ప్రోత్సహించాలి

**- ఎమ్మెల్యే ఘంటా శ్రీనివాసరావు**

హైదరాబాద్(రవీంద్రభారతి), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి పట్టంకట్టి జీనియస్ అవార్డులతో సుచిరిండియా ఫౌండేషన్ ప్రోత్సహించడం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడు ఘంటా శ్రీనివాసరావు సంస్థను, ఛైర్మన్ లయన్ కిరణ్‌లను అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, విద్య, ఆరోగ్యం పట్ల కార్యోన్ముఖులను చేయడం శ్లాఘనీయమని అన్నారు. ప్రముఖ సామాజిక సేవాసంస్థ సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఏపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఘంటా శ్రీనివాసరావు విశిష్ట అతిథులు సినీ నటుడు శ్రీకాంత్, శివాజీరాజా, లయన్ కిరణ్ తదితరులతో కలిసి జ్యోతి ప్రకాశనంచేసి ముందుగా సూచిరిండియా ఫౌండేషన్ కాఫీటేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన 33వ జాతీయస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో ఎంపికైన 20మందికి గోల్డ్ మెడల్స్, 20మందికి నేషనల్ ర్యాంక్స్, 20మందికి రాష్ట్రస్థాయి మెడల్స్, 450 మందికి జిల్లాస్థాయి ర్యాంకులు పొందిన యువ ప్రతిభావంతులైన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా అందజేశారు.

## విద్యాసంస్థల్లో 6 వరకు ఆధార్ క్యాంపులు

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 6 వరకూ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. 15 నుంచి 17 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. అలాగే ఈ నెల 16 నుంచి 20 వరకు మరో విడత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

## హనీట్రాప్... మహిళ అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఓ బాధితుడు ఫిర్యాదు చేయడంతో హనీట్రాప్ మోసానికి పాల్పడిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తంగెళ్లబీడుకు చెందిన కనపర్తి రేణుక అనే మహిళ యువతులను ఆకర్షించేలా అమ్మాయిల ఫొటోలు చూపిస్తూ వ్యక్తులను మాయలో పడేసి డబ్బులు దోచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో మాధవరావు అనే వ్యక్తిని పిలిపించి అతని వద్ద నుంచి ఉంగరం, రూ.5 వేల నగదును కాజేసింది. అనంతరం అత్యాచారం కేసు పెడతానని బెదిరిస్తూ మరో రూ.2 లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, రేణుకతో పాటు ఆమెకు సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

## అమరావతి రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్‌గా భూపతిరాజు రవీంద్ర

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ఒక ఐక్య ఉద్యమ కార్యాచరణను చర్చించి రూపొందించేందుకు నగరంలోని ఫిలిం ఛాంబర్ నందు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడమైనది. రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు వీఆర్ఏ మొదలుకొని డిప్యూటీ కలెక్టర్ వరకు ఒకే ఉద్యమ కార్యాచరణ ఉండాలనే ఉద్దేశంతో రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎ. విఆర్ఓ. సర్వేయర్లు. జూనియర్ సీనియర్ అసిస్టెంట్లు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు. డిప్యూటీ తహశీల్దార్లు, మండలం తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు. అందరూ ఏకతాటిపై కన్నతల్లి లాంటి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కలిసి మెలిసి ఒకే తల్లి బిడ్డలుగా ఐక్యంగా ఉండాలని రెవెన్యూ జేఏసీ ఏర్పాటు సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా పనిచేయడానికి అందరూ అన్ని క్యాడర్లలో, ఉన్న రెవెన్యూ ఉద్యోగులతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నందు రెవెన్యూ జేఏసీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రం నలుమూలలు నుండి రెవిన్యూ ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక, వైద్య రంగంలో విప్లవాత్మక అభివృద్ధి

**మాటల్లో కాదు.. ఆస్పత్రులు, సేవలు, సంస్కరణల్లో కనిపిస్తోంది: మంత్రి వాసంశెట్టి సుభాష్**

సచివాలయం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్రం పునర్నిర్మాణ దిశగా వేగంగా అడుగులు వేస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్న స్పష్టమైన సంకల్పంతో, ముఖ్యంగా కార్మికవర్గ సంక్షేమం, వారి ఆరోగ్య భద్రతకు అత్యున్నత ప్రాదాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది కేవలం ప్రకటనలకు పరిమితం కాదు. ప్రజల జీవితాల్లో ప్రత్యక్షంగా కనిపించాలి. చంద్రబాబు నాయుడు పాలనలో అదే జరుగుతోందన్నారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 50పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలోని వేలాది కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోనికి వచ్చాయని మంత్రి తెలిపారు. డాక్టర్లు, నర్సులు, సాంకేతిక సిబ్బంది నియామకాలతో సేవల నాణ్యత మరింత పెరిగిందన్నారు. వైద్య మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కర్నూలు, గుంటూరు జిల్లాల్లో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి భూముల కేటాయింపులు పూర్తయ్యాయని చెప్పారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈఎస్ఐ డిస్పెన్సరీలు నిర్మాణానికి ఉచితంగా భూములు కేటాయించడం ద్వారా గ్రామీణ స్థాయిలోనే ప్రాథమిక వైద్యం అందుబాటులోనికి వచ్చిందన్నారు.దీనివల్ల కార్మికుల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు.

### విశాఖకు గర్వకారణం ఈఎస్ఐ మెడికల్ కాలేజ్

విశాఖలో 400పడకల ఈఎస్ఐ ఆస్పత్రిలో అనుసంధానంగా 50ఎంబిబిఎస్ సీట్లతో ఈఎస్ఐ మెడికల్ కాలేజ్‌కు అనుమతి రావడం రాష్ట్ర ఆరోగ్యరంగంలో చారిత్రాత్మక మైలురాయిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్థానిక కమిటీల ఏర్పాటు ద్వారా ఈఎస్ఐ పథకాల అమలు మరింత పారదర్శకంగా ప్రజలకు దగ్గరగా మారిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి ఆస్పత్రులు, సేవలు, సంస్కరణల రూపంలో ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపిస్తుంని మంత్రి వ్యాఖ్యానించారు.



## భూ తగాదాల్లో తల్లీకొడుకు దారుణహత్య



శింగనమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా శింగనమల మండలం తరిమెల గ్రామంలో భూ తగాదాలలో సోమవారం రాత్రి తల్లికొడుకులను దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తరిమెల గ్రామానికి చెందిన నల్లప్పకి ఇద్దరు భార్యలు. కొద్ది సంవత్సరాల క్రితం నల్లప్ప చనిపోవడంతో రెండు కుటుంబాల మధ్య భూ తగాదలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రెండవ భార్య యల్లమ్మ(38) అంగన్వాడి టీచర్, ఆమె కొడుకు చిన్న(22) సోమవారం రాత్రి హత్యకు గురయ్యారు. పోలీసులు విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు గత కొంత కాలంగా ఆస్తికి సంబంధించిన వివాదాలు వారి కుటుంబ సభ్యుల మధ్య కొనసాగుతున్నట్లు తెలిసింది. గ్రామస్తుల వివరాల మేరకు హత్యకు గురైన యల్లమ్మను వెంటాడి తలనరికి కాలనీలో తిప్పడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురైనట్లు తెలిపారు. ఆమె కుమారుడు చిన్నను సైతం నరికి, తలపై బండరాయి వేసి హతమార్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేసిన ప్రత్యేక బృందంచే దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## నిరంతర విద్యుత్ సరఫరానే ధ్యేయం

**'కరెంటోళ్ల జనబాట'లో ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలనే ధ్యేయంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా కొనసాగుతున్న "కరెంటోళ్ళ జనబాట" కార్యక్రమం మంగళవారం తిరుపతి సర్కిల్ ఎస్ఇ చంద్రశేఖర రావు, ఇఇ దేవాశీర్వాదంతో కలిసి తిరుపతి జిల్లా నారాయణవనం సమీపంలోని బ్రాహ్మణతంగేళి గ్రామంలో పర్యటించారు. ఆ గ్రామంలో విద్యుత్తు లైన్లను పరిశీలించి, విద్యుత్ సరఫరా తీరుపై వినియోగదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూఫ్ టాప్ సోలార్, స్మార్ట్ మీటర్ల ఉపయోగాలను వినియోగదారులకు వివరించారు. అనంతరం అదే గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకొని, సలహాలు, సూచనలను అందజేశారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యుత్ సరఫరా తీరును తెలుసుకున్నారు. ఆ తర్వాత నారాయణవనం 33/11కెవి సబ్‌స్టేషన్ ను తనిఖీ చేశారు. అనంతరం శివశంకర్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్ మీటర్ల అంశంపై వినియోగదారుల్లో ఉన్న ఆపోహాలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలూ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం, లోవోల్టేజ్ సమస్యను అధిగమించడం తదితర సమస్యల సత్వర పరిష్కారం కోసమే ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అధికారులు తమ సిబ్బందితో నిర్దేశిత గ్రామాల్లో పర్యటిస్తూ, ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని వివరించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయప్రకాష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌పిడిసిఎల్‌లో పదోన్నతులు

**ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు**



చీఫ్ జనరల్ మేనేజర్ సిహెచ్ రామచంద్రరావు

తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ సంస్థలో అర్హులైన పలువురికి పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ రామచంద్ర రావుకు చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హెచ్‌ఆర్‌డి విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. శోభా వాలెంటీనా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను సిహెచ్ రామచంద్రరావుకు అప్పగించారు.

అలాగే సంస్థలో పిఎంఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన పి.హెచ్. జానకిరామ్ గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేయడంతో ప్రాజెక్ట్స్ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జె. రమణా దేవికి ఆ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కర్నూలు సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.లతకు జనరల్ మేనేజర్(ఐటి ,ఎస్ఎపి) గానూ, కార్పొరేట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. హేమలతకు సూపరింటెండింగ్ ఇంజనీర్(డిపిఇ) గానూ పదోన్నతి కల్పించారు.

సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎన్.డేవిడ్ లివింగ్ స్టోన్, ఎల్. ప్రసాద్, ఎస్.కళ్యాణ్ చక్రవర్తిలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.లలితకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గానూ పదోన్నతి కల్పించారు. కార్పొరేట్ కార్యాలయంలో ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ కారణంగా మరో చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టు ఖాళీ ఏర్పడనుంది.

## ఐదుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్



మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాలో పొలంలో గంజాయి సాగు చేసి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం మదనపల్లె డిఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

పీటీఎం మండలం, మల్లెల గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి తన పొలంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తూ విక్రయాలు చేస్తున్నాడు. ఆ పంటను డబ్బు ఆశ చూపి సురేంద్ర, అఫ్రీద్, పురుషోత్తం, ఆదిల్ అనే యువకుల ద్వారా మార్కెట్లోకి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న బి. కొత్తకోట పోలీసులు నిఘా ఉంచి, ముఠా సభ్యులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేసే మత్తు పదార్థాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, సాగు చేసినా, అమ్మినా జైలు శిక్ష తప్పదని ఎస్పీ హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన మదనపల్లి డిఎస్పీ మహేంద్ర, బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## భోళాశంకరుని తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు

**శివరాత్రి పర్వదినాన 2లక్షల మంది దర్శనాలకు ఏర్పాటు**



సాంస్కృతిక వేదిక ముస్తాబు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏటా నిర్వహించే శివయ్య తిరునాళ్ళను అంగరంగ వైభవంగా గతం కాన్న భిన్నంగా నిర్వహించాలన్న పాలకుల సూచనలతో అధికారులు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే శాసనసభ్యుడు, జిల్లా కలెక్టర్, ఎస్పిలతో వేరువేరుగా సమీక్షా సమావేశాలు జరిపారు. ఈ ఏడాది రూ.6 కోట్ల ప్రాథమిక అంచనాలతో శివరాత్రి నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిణ వేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఊరంతా విద్యుత్ వెలుగులతో ముస్తాబు చేసారు. అన్ని పనులకు సంబంధించి టెండర్లను ఖరారు చేసారు. పనులను చకచకా జరగటానికి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కాగా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగస్వాములైన మున్సిపల్ అధికారులు మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశం అయి తమ సిబ్బందితో సమీక్షించుకున్నారు. ఈ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాల్లో కొత్తదనం ఉండాలని సూచించారు. విమర్శలకు, ఆరోపణలకు అవకాశం లేకుండా నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల్లో ప్రధానంగా సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణ ఎంతో ప్రాధాన్యత కల్గి ఉండటంతో ఈ అంశాన్ని పరిగణలో తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక వేదికను రూపకల్పన చేస్తున్నారు.




## ప్రపంచ 18వ ర్యాంక్‌లోకి అనహాత్



**న్యూఢిల్లీ:** స్క్వాష్‌లో భారత్‌కు చెందిన టీనేజ్ అమ్మాయి అనహాత్ సింగ్ ప్రపంచ ర్యాంకింగ్స్ టాప్ 20లో చోటు సంపాదించుకుంది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పిఎస్ఎ) మంగళవారం విడుదల చేసిన మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 12స్థానాలుఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంక్ 19కి చేరుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఈ నెల 1న జరిగిన 2026 స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో ఆమె మొట్టమొదటి టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత ఈ ఎత్తుకు ఎదిగింది. వాషింగ్టన్‌లో టైటిల్ గెలుచుకునే మార్గంలో ఆమె ఫైనల్‌లో ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి, ఇంగ్లాండ్‌కు చెందిన టాప్ సీడ్ జార్జినా కెనెడ్డీని ఓడించింది. ఢిల్లీకి చెందిన 17 ఏళ్ల ఈమె ప్రస్తుతం 13 టోర్నమెంట్లలో 387 పాయింట్లు కలిగి ఉంది. మహిళల సింగిల్స్‌లో అత్యధిక ర్యాంక్ పొందిన భారతీయురాలుగా చరిత్ర సృష్టించింది. ఇదే విభాగంలో తదుపరి అత్యుత్తమ ర్యాంక్ పొందిన భారతీయుల్లో అనుభవజ్ఞురాలు జోష్నా చినప్ప ఈ ర్యాంకింగ్స్‌లో 74వ స్థానానికి చేరుకుంది.

ఎటిపి డబుల్స్ 20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో యూకీ భాంబ్రీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ కెరీర్‌లో అత్యధికంగా 20వ స్థానానికి ఎగబాకాడు. రోహన్ బోపన్న తర్వాత టాప్ 20లోకి ప్రవేశించిన మొదటి భారతీయ పురుషుల డబుల్స్ ఆటగాడిగా నిలిచాడు. 33 ఏళ్ల అతను గతంలో 22వ ర్యాంక్ నుండి పైకి వెళ్లాడు. గత ఏడాది అతను దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో తన తొలి ఎటిపి 500 డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్ ప్రారంభంలో, భాంబ్రి భారతదేశంలో నంబర్ 1 డబుల్స్ స్థానానికి చేరుకున్నాడు.




## టి 20 హిస్టరీలో ప్లేయర్లు పరుగుల వర్షం

### టాప్ 5లో ఇద్దరు టీమిండియా స్టార్స్

**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రపంచంలో పొట్టి ఫార్మాట్ అంటేనే పరుగుల వర్షం కురవాల్సిందే. ముఖ్యంగా ఐసీసీ టీ20 ప్రపంచకప్ వేదికపై ప్రపంచ స్థాయి బౌలర్లను అడ్డుకుని, పరుగుల జోరు కనపరచాలంటే ఏ బ్యాటర్‌కైనా సవాలే. 2007 నుంచి మొదలైన ఈ టీ20 వరల్డ్‌కప్ మెగా టోర్నీలో ఎందరో దిగ్గజాలు తమదైన శైలిలో విరుచుకు పడి అత్యధిక పరుగులు చేశారు. ఇప్పటి వరకు ఉన్న లెక్కల ప్రకారం (ఫిబ్రవరి 2026 నాటికి), టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఐదుగురు ఆటగాళ్లలో ఇద్దరు టీమిండియాకు చెందినవారు ఉన్నారు. ఈ జాబితో రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. 2012 నుంచి2024 వరకు అతడు 35 మ్యాచ్‌ల్లో అద్భుతమైన సగటుతో (58.72) ఈ పరుగులు సాధించాడు. 2014 ఎడిషన్‌లో కోహ్లీచేసిన 319 పరుగులు ఒకేప్రపంచకప్‌లో ఒకబ్యా టర్ చేసిన అత్యధిక పరుగులుగా రికార్డుసృష్టించాయి.ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ రెండో స్థానంలో నిలిచాడు. 2007 ప్రారంభ ఎడిషన్ నుంచి 2024 వరకు అన్ని ప్రపంచకప్‌లలో ఆడిన ఏకైక భారతీయ ఆటగాడు రోహిత్. ఓపెనర్‌గా జట్టుకు దూకుడైన ఆరంభాన్ని ఇవ్వడంలో ఆయన శైలేవేరు. శ్రీలంక బ్యాటర్ మహేళ జయవర్ధనే టీ20 ప్రపంచకప్‌లో 1,000 పరుగుల మైలురాయిని దాటిన తొలి ఆటగాడిగా నిలిచాడు. క్లాసిక్ షాట్లతో టీ20లలో కూడా పరుగులు సాధించవచ్చని ఆయన నిరూపించాడు. ప్రస్తుత తరంలో అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లలో జోస్ బట్లర్ ఒకరు. ఇంగ్లాండ్ కెప్టెన్‌గా జట్టుకు ప్రపంచకప్‌ను అందించడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా అద్భుతమైన గణాంకాలను కలిగి ఉన్నాడు. ప్రస్తుతం టాప్5లో ఉన్న ఏకైక యాక్టివ్ ప్లేయర్ ఇతనే కావడం విశేషం. ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. 2021లో ఆస్ట్రేలియా మొదటిసారి టీ20 ప్రపంచకప్ గెలవడంలో వార్నర్ కీలక పాత్ర పోషించాడు. ఎడమచేతి వాటం బ్యాటర్‌గా ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టడంలో ఆయన సిద్ధహస్తుడు.

## భారత్ గెలుపు

### 38 రన్స్ తేడాతో అమెరికా ఓటమి

**న్యూఢిల్లీ:** అమెరికా ప్రపంచకప్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆయుష్ బదోని సారథ్యంలోని భారత్ ఏ జట్టు38పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఏ నిర్ణీత 20ఓవర్లలో 3వికెట్లకు 238 పరుగులు చేసింది. నారయణ్




జగదీషన్(55 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104) సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ ఆయుష్ బదోని(26 బంతుల్లో6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 60 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో బరిలోకి దిగిన తిలక్ వర్మ 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 పరుగులు చేశాడు. 158.33 స్ట్రైకరేట్‌తో బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అమెరికా బౌలర్లలో అలీ ఖాన్, జస్‌దీప్ సింగ్, శుభమ్ రంజనే తలో వికెట్ తీసారు. అనంతరం అమెరికా 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. సంజయ్ కృష్ణమూర్తి(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 41), ఆండ్రీస్ గౌస్(31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రవి బిష్ణోయ్(3/37) మూడు వికెట్లతో సత్తా చాటగా.. నమన్ ధీర్(2/6), ఖలీల్ అహ్మద్(2/25) రెండేసి వికెట్లు తీసారు. కాగా ఈ నెల 4న ముంబైలోని డివైపాటిల్ స్టేడియంలో భారత ప్రపంచకప్ జట్టు సౌతాఫ్రికా వరల్డ్ కప్ టీమ్‌తో వామప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ తరఫున కూడా తిలక్ వర్మ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. తిలక్ వర్మ రాకతో భారత తుది జట్టులో సంజూ శాంసన్ అవకాశం కోల్పోనున్నాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ సత్తా చాటడంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఆసియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్..

## భారత్ పురుషుల టీమ్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** పురుషుల క్వాడ్రంట్ ఫైనల్‌లో జపాన్‌ను ఓడించి ఆసియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్-2026లో భారత్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. నగోయా సిటీ మిజుహపార్క్ జిమ్నాసియంలో మంగళవారం జరిగిన పురుషుల క్వాడ్రంట్ టైటిల్ పోరులో భారత్ 15-10, 12-15, 15-12 తేడాతో గెలిచింది. సెమీఫైనల్లో థాయిలాండ్‌ను వరుస సెట్లలో ఓడించడానికి ముందు, మలేషియా, దక్షి ణ కొరియాపై విజయాలతో గ్రూప్ బి లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయం భారతదేశం క్రీడలో ఇటీవలి పురోగతికి తోడ్పడుతుంది. ఇక మార్చి 2025లో పాట్నాలో జరిగిన అంతర్జాతీయ సెపక్టక్రా ఫెడరేషన్ ప్రపంచ కప్‌లో తొలిసారిగా పురుషుల రెగు (ముగ్గురు ఆటగాళ్ల జట్టు) స్వర్ణాన్ని గెలుచుకుంది. 2026 ఆసియా క్రీడలపై దృష్టి సారించే ముందు, భారతదేశం మే నెలలో మలేషియాలో జరిగే పురుషుల ఆసియా కప్ మరియు జూలైలో థాయిలాండ్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడుతుంది.



మళ్లీ రూ. 20 వేలు పెరిగిన కిలో వెండి

## తులం బంగారం రూ.6వేలు పెరుగుదల




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** బంగారం, వెండిధరలు మరోసారి పెరిగాయి. అమెరికా ఫెడ్ ఛైర్మన్ నియామకం, ట్రేడ్‌డీల్‌లో సుంకాలు 18శాతానికి తగ్గిస్తామన్న ట్రంప్ ప్రకటనలతోబులియన్ మార్కెట్‌కళకళలాడింది. వీటి అవకాశంగా ఇన్వెస్టర్లు లాంగ్‌టర్మ్ లక్ష్యంగా కొనుగోళ్లకు దిగారు. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 4887 డాలర్లవద్ద కొనసాగింద.ఇ వెండిధరలు కూడా 85.98 డాలర్లుగా ట్రేడ్ అయింది. దేశీయంగా కూడా రెండులోహాలపై ధరలు పెరిగాయి. పదిగ్రాముల పసిడి బంగారం రూ.1.56 లక్షలకు పైబడింది. కిలో వెండిధరలు కూడా రూ.2.74 లక్షలుగా నమోదయింది. ముందురోజు ధరలతోప ఓలిస్తే బంగారం సుమారు రూ.6 వేలు పెరిగితే వెండిదరలు కిలోకు రూ.20 వేలు పెరిగింది. కమోడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసిఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్ట రూ.1.51 లక్షలవద్దట్రేడ్ అయితే కిలో వెండి రూ.2.60 లక్షలవద్ద కొనసాగింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ హరీష్ వి మాట్లాడుతూ గత వారం భారీ అమ్మకాల తర్వాత బంగారం, వెండి ధరలు స్థిరపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బులియన్ మార్కెట్‌కు మద్దతిచ్చే ఫండమెంటల్స్ ఇప్పటికీ బలంగానే ఉన్నాయని, ఇటీవల వచ్చిన దిద్దుబాటు ప్రధానంగా తాత్కాలిక కారణాల వల్లేనని ఆయన తెలిపారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. మార్చి 2026 డెలివరీకి సంబంధించిన లీడ్‌శ్రీ వెండి ధర 1 కిలోకు దాదాపు రూ.2.7 లక్షల స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం వెండి రూ.2,67,890 వద్ద ట్రేడవుతుండగా, ఇది దాదాపు 13.4 శాతం లాభాన్ని సూచిస్తుంది. ఇంట్రాడేలో వెండి ధర రూ.2,69,654 గరిష్టాన్ని తాకింది. అంతర్జాతీయంగా స్పాట్ సిల్వర్ కూడా 11 శాతం కంటే ఎక్కువగా పెరిగింది.

## ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తో అదానీకి భారీ లాభం




**ముంబయి, ఫిబ్రవరి 3:** స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో మంగళవారం దిగ్గజ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ షేర్లు దూసుకెళ్లాయి. ఒక్కరోజే 12 శాతం మేర పెరిగాయి. భారత్ అమెరికా మధ్య ట్రేడ్ అగ్రిమెంట్ ఖరారయిందన్న వార్తలతో భారత్‌పై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గిస్తామని అమెరికా ప్రకటించడం వంటివి స్టాక్ మార్కెట్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. దీనితో అదానీ గ్రూప్‌నకు కలిసొచ్చింది. అదానీ షేర్లను సైతం భారీగా కొనుగోలు చేశారు. నిఫ్టీ 50 బెంచ్‌మార్క్‌లో అదానీ ఎంటర్ ప్రైజెస్ టాప్ గెయినర్‌గా నిలిచింది. 12 శాతం మేర పెరిగి ఇంట్రాడే హై స్థాయి రూ.2,233.40 ని తాకింది. ఈ స్టాక్ 7.75 శాతం లాభంతో ట్రేడింగ్ మొదలు పెట్టగా ఆ తర్వాత దూసుకెళ్లింది. వరుసగా రెండో రోజు పెరిగింది. రెండు రోజుల్లో 14 శాతానికి పైగా పెరిగింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేర్లు ఎన్ఎస్ఈలో 8.33 శాతం మేర లాభంతో రూ.1520 వద్ద ట్రేడవుతున్నాయి. గత రెండు సెషన్లలోనే 12 శాతం మేర లాభపడింది. బెంచ్ మార్క్ ఇండెక్స్‌లో అత్యధికంగా లాభపడిన స్టాక్స్‌లో ఇదీ ఒకటి. మరోవైపు అదానీ గ్రూప్ కంపెనీలైన అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బలమైన ఇంధన వాణిజ్య సంబంధాలు, లోతైన ద్వైపాక్షిఆర్థిక సంబంధాలు,మౌలిక సదుపాయాల అవకాశాల నుంచి ఈ గ్రూప్ సంస్థలు లాభం పొందవచ్చనే అంచనాల మధ్య షేర్లు రాణిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసారు. భారత్ అమెరికా ట్రేడ్ డీల్ ద్వారా లబ్ధిపొందే వాటిల్లో అదానీ గ్రూప్ కంపెనీలు సైతం ఉంటాయని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ పేర్కొంది. అలాగే అదానీ పవర్, అదానీ పోర్ట్స్ ఈ డీల్ ద్వారా లబ్ధిపొందుతాయని దేశీయ బ్రోకరేజీ సంస్థ యాంటిక్యూ సూచించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 5.14 శాతం మేర పెరిగి ఇంట్రాడే హై స్థాయి 85,871 ని తాకింది. నిఫ్టీ 1250 పాయింట్ల మేర పెరిగి 26,341 గరిష్ఠ స్థాయిని తాకింది.

## ఎల్ఐసిలో ప్రభుత్వ వాటాను తగ్గిస్తున్న దీపమ్




**ముంబయి, ఫిబ్రవరి 3:** ప్రభుత్వరంగంలోని జీవిత బీమా సంస్థ ఎల్ఐసికి 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ మలి విడత పబ్లిక్ ఆఫర్‌కు వస్తోందని ఇందుకోసం కసరత్తుజరుగుతోందని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు వెల్లడించారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాను మరోసారి విక్రయించనుందని చెప్పొచ్చు. ప్రస్తుతం ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వ వాటా ఏకంగా 96.5 శాతంగా ఉంది. గతంలో ఐపీఓ రూపంలో రాగా ఇప్పుడు ఎఫ్‌పీఓ రూపంలో రాబోతుందని చెప్పొచ్చు. ఇందులో భాగంగా ఇప్పటికే లిస్టింగ్ అయిన కంపెనీ కొత్తగా ఇన్వెస్టర్ల కోసం మళ్లీ షేర్లను జారీ చేస్తుందని చెప్పొచ్చు. 2022 మే నెలలో ఎల్ఐసీ.. తొలి పబ్లిక్ ఆఫర్ వచ్చింది. అప్పుడు ప్రభుత్వం ఎల్ఐసిలో సుమారు 3.5 శాతం వాటాను విక్రయించింది. ఇక్కడ ఐపీఓ కోసం ఎల్ఐసీ ఇష్యూ ధర సుమారు రూ. 902-949 రేంజ్‌లో ఉండగా ప్రభుత్వానికి సుమారు రూ. 21 వేలకోట్ల మేర నిధులు సమకూరాయి. ఇష్యూ ధరతో పోలిస్తే 5 శాతం వరకు తక్కువతో లిస్టింగ్ అయి తొలిరోజు రూ. 875 వద్ద ముగిసింది. తర్వాత కూడా పెద్దగా రాణించింది లేదు. ఎల్ఐసీలో ఇప్పటికే ప్రభుత్వ వాటాను తగ్గించమని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగాన్ని (దీపమ్) కోరినట్లు నాగరాజు తెలిపారు. ఈ క్రమంలోనే మార్కెట్ పరిస్థితులు బాగానే ఉండి అన్ని అనుమతులు వస్తే గనుక వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఎఫ్‌పీఓ ఉంటుందని తెలిపారు.

## మార్కెట్లకు ఇండో-యుఎస్ ట్రేడ్‌డీల్ సపోర్ట్

### ఒక్కరోజే రూ.12 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

### అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరు..




**ముంబయి, ఫిబ్రవరి 3:** భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటిండంతో మంగళవారం దేశీయ స్టాక్‌మార్కెట్లు భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. గ్లోబల్ పాజిటివ్ సంకేతాలు, ముఖ్యంగా భారత్-అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా మార్కెట్లు ఓపెనింగ్ నుంచే బుల్ రన్‌లోకి దూసుకెళ్లాయి. ఇన్వెస్టర్లసంపదకు రెక్కలొచ్చాయి. బిఎస్ఇ విలువల్లో చూస్తే ఇన్వెస్టర్లకు రూ.12 లక్షలకోట్లు లాభంచేకూరింది. బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీ లమొత్తం విలువలురూ.12 లక్షలకోట్లుపెరిగి రూ.467.35 లక్షలకోట్లకు పెరిగింది. బీఎస్ఈ సెన్సెక్స్ 2,072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 639.15 పాయింట్లు పెరిగి 25,725.67 స్థాయిలో ముగిసింది. ఓపెనింగ్ సెషన్‌లోనే సెన్సెక్స్ 3,600 పాయింట్ల వరకూ ఎగబాకడం విశేషం. నిఫ్టీ 26,300 మార్క్‌ను తాకి రికార్డు స్థాయిని అందుకుంది. మార్కెట్ ప్రారంభం నుంచే అన్ని రంగాల్లో కొనుగోళ్లు జోరుగా కనిపించాయి. అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అంగీకరిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో పాటు, భారత్ ఉత్పత్తులపై ఉన్న ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై విధించిన అదనపు సుంకాలు ఈ తగ్గింపులో భాగం కావడంతో భారత ఎగుమతులకు పెద్ద ఊరట లభించనుంది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు గేమ్ చేంజర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేసారు. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్, రియాల్టీ, ఆటో, ఐటీ, మెటల్ రంగాల షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2.5 శాతం పైగా ఎగబాకింది. ఐటీ సూచీ దాదాపు 5.8 శాతం పెరిగితే, ఆటో 5 శాతం, మెటల్ 3.8 శాతం, ఫార్మా 4.2 శాతం లాభపడింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా 4 శాతం కంటే ఎక్కువగా పెరిగి విస్తృత ర్యాలీని సూచించాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ, ఈ ట్రేడ్ డీల్ భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద బూస్ట్ ఇస్తుందని చెప్పారు. బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు, టెలికాం, క్యాపిటల్ గూడ్స్, ఐటీ రంగాలు ముందంజలో ఉండొచ్చని అంచనా. రూపాయి మారకం విలువ కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే నిన్న 91.49 వద్ద ముగిసిన రూపాయి నేడు 90.30 స్థాయికి చేరింది. విదేశీ ఇన్వెస్టర్లలో సానుకూల ధోరణులు పెరగడంతో కరెన్సీ మార్కెట్‌లో కూడా మెరుగైన ధోరణి కనిపిస్తోంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగియగా, ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో పయనించాయి. జపాన్ నిక్కీ 3 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతంగా పెరిగాయి. ఈ గ్లోబల్ సానుకూలత దేశీయ మార్కెట్లకు అదనపు మద్దతు ఇచ్చింది. భారత్-అమెరికా ట్రేడ్ ఒప్పందం మార్కెట్ సెంటిమెంట్‌ను పూర్తిగా మార్చేసింది. ఇన్వెస్టర్ల విశ్వాసం పెరగడంతో రాబోయే రోజుల్లో కూడా మార్కెట్లు కొత్త రికార్డులను సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిఎస్ఇ పరంగాచూస్తే 3304 షేర్లుపెరిగి 981 షేర్లుమాత్రమే క్షీణించాయి. 151 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2నాటి సెటిల్‌మెంట్లు 5.73శాతంపెరిగి రూ.1,52,235కి చేరాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 4921 డాలర్ల వద్ద ఉంది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్‌నాటి సెటిల్‌మెంట్లలో 19 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 66.11 డాలర్లుగా ట్రేడ్ అయింది. డాలరుతో పోలిస్తే గ్లోబల్ మార్కెట్లో రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా ట్రేడ్ డీల్ తర్వాత ఒక్కరోజులోనే 1.36 బలపడింది. దీంతో ఈరోజు రూపాయి విలువ 90.26కు చేరింది. సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 9.12 శాతం పెరగగా బజాజ్ ఫైనాన్స్ 6.68 శాతం, ఇండిగో 5.51 శాతం, సన్ ఫార్మా 4.54 శాతం మేర లాభపడ్డాయి.

## రిలయన్స్‌సహా టాప్ 10 కంపెనీల మార్కెట్‌క్యాప్ భారీ ర్యాలీ!




**ముంబయి, ఫిబ్రవరి 3:** భారత్ అమెరికాలమధ్య వాణిజ్యడీల్ ఖరారయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించిన మరుసటిరోజునుంచే భారీ కంపెనీలు షేర్లుపెరిగాయి, రిలయన్స్ చీఫ్ ముఖేష్ అంబానీకి కలిసి వచ్చింది. టాప్ 10 కంపెనీలలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు 7 పెరిగాయి, ఇన్ఫోసిస్, టిసిఎస్ షేర్లు 5 కంటే ఎక్కువ లాభాలను పొందాయి. అలాగే ఎస్‌బిఐ కూడా 6 పెరిగింది. ప్రధాన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ ఒక్కరోజులోనే రూ.5.40 లక్షల కోట్లకు పైగా పెరిగింది. అలాగే ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 4,200 పాయింట్లకు పైగా దూసుకువెళ్లింది. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 7 శాతానికి పైగా పెరిగాయి. అలాగే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,33,768.49 కోట్లు పెరిగి రూ.20,14,985.17 కోట్లకు చేరుకుంది. ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు దాదాపు 7 శాతం పెరిగాయి. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.96,488.38 కోట్లు పెరిగి, రూ.15,23,500.64 కోట్లకు చేరుకుంది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలలో ఒకటైన ఇన్ఫోసిస్ షేర్లు 6 శాతం పెరిగింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.41,068.96 కోట్లు పెరిగి, రూ.7,17,865.49 కోట్లకు చేరువ అయ్యింది. టీసీఎస్ షేర్లు 5.28శాతం పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాప్ విలువ రూ.60,563.02 కోట్లు పెరిగి, రూ.12,07,172.33 కోట్లకు చేరుకుంది. ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు 4.72 శాతం పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.45,637.64 కోట్లు పెరిగి, రూ.10,12,898.08 కోట్లకు చేరువ అయ్యింది. ఎస్బీఐ షేర్లు కూడా దాదాపు 6 శాతం మేర పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విషయానికి వస్తే రూ.56,803.76 కోట్లు పెరిగి, రూ.10,05,948.20 కోట్లకు చేరుకుంది. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసిజి కంపెనీ హిందుస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2 శాతం పెరిగి మార్కెట్ క్యాప్ రూ.10,291.21 కోట్ల పెరిగి మొత్తం విలువ రూ.5,63,807.91 కోట్లకు చేరుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.